కర్నూలు | నంద్యాల
వార్త
6 జూలై , 2023 గురువారం పేజీలు 4

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



**నంద్యాల క్రైం, జూలై 5, ప్రభాతవార్త:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాగ్‌రూట్‌లో వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని పోలీస్ భద్రత సూచనలు పాటిస్తు క్షేమంగా గమ్యస్థానానికి చేరాలని సూచించారు. మైనర్లకు, లైసెన్స్ లేనివారికి మోటర్ సైకిళ్లు, కార్లు ఇతరులకి ఇస్తే ప్రమాదాలు జరిగితే సదరు వ్యక్తులపై కేసులు నమోదుచేయడం జరుగుతుందని తెలిపారు. కేసులు రుజువైతే పది సంవత్సరాలు జైలుశిక్షకు అర్హులు అవుతారని మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని హెచ్చరించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. స్పెషల్ డ్రైవ్ అనునిత్యం జరుగుతుందని తెలిపారు. పోలీస్ యంత్రాంగం సమిష్టి కృషితో రోడ్డు ప్రమాదాలు నియంత్రించవచ్చని తెలిపారు. లైసెన్స్ లేనివారిపై 1259 కేసులు, హెల్మెంట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారికి 4684, మైనర్లపై 81 కేసులు, రాంగ్‌రూట్‌లో వెళ్లిన వారిపై 79 కేసులు, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడిపిన వారిపై 786, జంపింగ్ సిగ్నల్స్ కేసులు 36, రికార్డులు లేకుండా వాహనాలు నడిపిన వారిపై 1946 కేసులు, అతివేగం వెళ్లిన వారిపై 109 కేసులు, సీట్‌బెల్టు ధరించకుండా వెళ్తున్న కారు, జీపులు తదితర వాహనాల శోధకులపై 389, ఓవర్‌లోడ్ వాహనాలపై 74, త్రిబుల్ రైడింగ్ కేసులు 2061, రాంగ్‌పార్కింగ్ చేసిన వాహనాలపై 3193, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 740, రాంగ్‌ఎపారి కింగ్ చేసిన త్రీవీలర్‌పై 2006 కేసులు నమోదుచేసినట్లు తెలిపారు.




# సీనియర్స్, జూనియర్స్‌ల మధ్య.. నలిగిపోతున్న కమలం పార్టీ..!

**- నంద్యాల జిల్లాలో ఏవరికి వారే యమునాతీరే... బిజెపి**

**దేశంలో నరేంద్రమోధీ ప్రధాన మంత్రిగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పలు రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో కొనసాగుతుంటే దక్షిణాదిలో కూడ పాగవేసేందుకు తెలంగాణ, ఏపీలో సైతం నూతన పార్టీ అధ్యక్షులను ఏర్పాటు చేసిన సంఘటన తెలిసిందే. అయితే నంద్యాల జిల్లాలో మాత్రం బిజెపి పార్టీ కార్యకర్తలు, అభిమానులు మోఢీ, అమిత్‌షా శిశ్యులు పుష్కలంగా ఉన్నారు. గతంలో నంద్యాల మున్సిపల్ కౌన్సిలర్లు కూడ బిజెపి అభ్యర్థులు గెలుపొందిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం కూడ గ్రామీణ ప్రాంతాల్లో ఎంపిటిసిగా కూడ గెలిచిన అభ్యర్థులు ఉన్నారు. నంద్యాల జిల్లాలో బిజెపి నాయకత్వ లోపంతో ముందుకుగా సాగని పరిస్థితి కొరవడింది. జిల్లాలో సీనియర్స్, జూనియర్స్ అంటూ ఏవరికి వారే యమునాతీరుగా వ్యవహరిస్తున్నారు.**

*నంద్యాల విద్య, ప్రభాతవార్తః*

ఇటీవల రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సోమువీర్రాజు నంద్యాల జిల్లాలో పర్యటించారు. మోఢీ 9 సంవత్సరాల పాలన గురించి విస్తృతంగా ప్రచారం చేశారు. జిల్లాలో పార్టీని సమర్థవంతంగా నడిపించే నాయకులు ఉన్నప్పటికి కిందిస్థాయి కార్యకర్తల్లో స్థబ్దతగా ఉండడం విశేషం. ఏదైనా సంఘటన జరిగినప్పుడు హడావిడి చేయడమే తప్పా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకపోవడం విశేషం.మోఢీ 9 సంవత్సరాల పరిపాలనలో ప్రధానమంత్రిగా అనేక పథకాలు దేశవ్యాప్తంగా అమలు చేశారు. ఏపీలో కూడ అవే పథకాలను అమలుచేస్తు రాష్ట్ర ప్రభుత్వం తన పేర్లను పెట్టుకోవడంలో విజయం సాధించింది. ఈవిషయాలను బిజెపి పార్టీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తన పేర్లుగా మార్చుకుందని ప్రజలకు కిందిస్థాయిలో నుంచి చెప్పాల్సిన అవసరం ఉన్నప్పటికి రాష్ట్రస్థాయి నాయకులు వచ్చినప్పుడు మాత్రమే ఇలాంటి విషయాలు తెలుపుతున్నారని జిల్లాలోని మండలాల్లోని నాయకత్వం ప్రజల్లోకి ఈ విషయాలు తీసుకెళ్లకపోవడం విశేషం. బిజెపిని బలోపేతం చేసేందుకు రాష్ట్ర నాయకత్వం మార్పు ఒక సూచికగా ఉంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కూడ బిజెపి పార్టీకి బలమైన క్యాడర్ ఉన్నప్పటికి దాన్ని నడిపించే నాయకత్వం లేకపోవడం విశేషం. జిల్లాలో ఒక ప్రసిడెంట్‌తో పాటు 13 అఫీస్ బేరర్స్, 47 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌తో కలిపి 61 మందితో..

2లో

# రక్తం తాగేస్తున్న సైకో నుండి రాష్ట్రాన్ని ప్రజలు కాపాడుకోవాలి.!

**- మినీ మేనిఫెస్టోతో పేదల సంక్షేమాభివృద్ధికి తోడ్పాటు**
**- టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి, మాజీ మంత్రులు కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత**



**ఆలూరు, జూలై 5, ప్రభాతవార్త**

ఆలూరులో తెదేపా సీనియర్ నాయకులు, కార్యకర్తలు వారికి ఘనంగా పూలమాలతో స్వాగతం పలికి ద్విచక్ర వాహనాలు, కారు కాన్వాయ్‌తో తెదేపా జెండాలతో పాత బస్టాండ్‌కు చేరుకుని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, వాల్మీకుల ఆరాధ్య దైవం వాల్మీకి మహర్షి విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ మంత్రులు కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యేలు కోట్ల సుజాతమ్మ, పార్థసారథి, మంత్రాలయం, పత్తికొండ, కోడుమూరు తెదేపా ఇంచార్జ్‌లు తిక్కారెడ్డి, కెఈ శ్యాంబాబు, ఆకె పోగు ప్రభాకర్‌లు మాట్లాడుతూ సైకో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుండి ప్రజా వేదికతోనే కూల్చివేతలు మొదలుపెట్టి అమరావతిని మూడుముక్కలాట ఆడుతూ రాష్ట్ర అభివృద్ధికి గాలికి వదిలేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమం పేరుతో ఉన్న పథకాలను రద్దు చేసి నవరత్నాల కొరకు బస్సు, పెట్రోల్, డీజిల్, విద్యుత్, నిత్యావసర ధరలు పెంచి ప్రజల రక్తం తాగేస్తున్న సైకో నుండి రాష్ట్రాన్ని ప్రజలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇదేమిటని మాట్లాడినా..ప్రశ్నించినా..ధర్నాలు..నిరసనలు..చేపట్టినా అక్రమ కేసులు, దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తెదేపా అధికారంలోకి రాగానే వైకాపా లెక్కలు వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. తెదేపా అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోతో రాష్ట్రంలోని నిరుపేదల సంక్షేమ అభివృద్ధి కొరకు 6పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకాలను తెదేపా నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి తెలపాలన్నారు. ఆలూరు నియోజకవర్గంలో ప్రజలకు తాగేందుకు నీరు లేకపోయినా మద్యం మాత్రం పుష్కలంగా అందిస్తున్నారని వారు ఎద్దేవ చేశారు. తెదేపా నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెదేపా అధికారంలోకి రాగానే ఒక కేసుకు పది కేసులు పెడతామని వారు హెచ్చరించారు. అనంతరం భోజన విరామం తర్వాత మండల పరిధిలోని హులేబీడు, మణేకుర్తి మీదుగా కమ్మరచేడుకు బస్సుయాత్ర చేరుకుంది. ఈ బస్సు యాత్ర కార్య క్రమానికి ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి తెదేపా సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైకుంఠం జ్యోతి, ఏరూరు మీనాక్షినాయుడు, కురువ జయరాం, నారాయణరెడ్డి, సులక్షణరెడ్డి, మీనాక్షి నాయుడు, మణేకుర్తి రాజశేఖర్, మండల కన్వినర్ అశోక్, షేక్షావలి, సుధాకర్ తదితరులున్నారు.

**రక్తం తాగేస్తున్న సైకో నుండి రాష్ట్రాన్ని ప్రజలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ మంత్రులు కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మలు అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ, మహానాడులో ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెదేపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు చేపట్టిన బస్సుయాత్రను ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో మొదలై చిన్నహోతూరు, పెద్దహోతూరు గ్రామాల మీదుగా ఆలూరుకు చేరుకుంది.**

# వక్ఫ్‌బోర్డు స్థలంలో పెట్టిన హెచ్చరిక బోర్డును కూల్చివేసిన కబ్జాదారులు



నంద్యాల, జూలై 5, ప్రభాతవార్తః

వక్ఫ్‌బోర్డు స్థలంలో అక్రమ కట్టడాలను ప్రభుత్వ అధికారులు కూల్చివేస్తున్న సంఘటనలు గత వారం రోజులుగా చోటు చేసుకుంటున్నాయి. వక్ఫ్‌బోర్డు భూముల స్థలంలో ప్రభుత్వ అధికారులు ఒక హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఆ హెచ్చరిక బోర్డులో వక్ఫ అస్తుల్లో ఇతరులు ప్రవేశించరాదని అక్రమ కట్టడం నేరమని చెప్పి సిమెంటు కట్టడంతో బోర్డును ఏర్పాటు చేశారు. రాత్రికి రాత్రి కబ్జాదారులు బోర్డును దౌర్జన్యంగా కూల్చివేశారు. ఇందులో ఏవరి ప్రమేయం ఉందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. వక్ఫ్‌భూములు వందల ఎకరాల్లో ఉన్నాయి. ఎన్ని సంవత్సరాల నుంచో భూములు అక్రమణకు గురవుతున్నాయి. ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీ నాయకుల అనుచరులు వక్ఫ్‌భూములను కబ్జాచేసిన సంఘటనలు చాల ఉన్నాయి. నూనెపల్లె జామియా మసీదుకు చెందిన దాదాపు 75 ఎకరాలు అక్రమణకు గురయినట్లు అధికారులు తెలుపుతున్నారు. సర్వేనం.231,47,52 నంబర్లలోని భూములు అక్రమణకు జరిగాయని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సర్వే కమిషనరు షెక్ షహనాబేగంతో పాటు అధికారులు ఈప్రాంతమంతా వారం రోజుల పాటు తిష్టవేశారు. ఈబోర్డులు కబ్జాదారులు పడగొట్టారని పడగొట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముస్లీం సంఘాల నాయకులు కోరుతున్నారు.

# అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి : జిల్లా కలెక్టర్ డా.జి.సృజన



**కర్నూలు, జూలై 05, ప్రభాతవార్త :** అంగన్వాడీ కేంద్రాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సిడిపిఓలతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న సమస్యలను చర్చిస్తూ 360 అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు లేవని, 151 కేంద్రాలలో పనిచేయని మరుగుదొడ్లు మరమ్మత్తులు చేయించాలని, 481 కేంద్రాలలో నీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని, 306 కేంద్రాలలో విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయిస్తామని కలెక్టర్ తెలిపారు. 81 కేంద్రాలను నాడు-నేడు కింద చేపట్టడం జరిగిందని పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఇందులో కొన్నింటికి ప్లాన్ నందు మరుగుదొడ్లు చూపెట్టలేదని వాటిని ఏజెన్సీ లతో మాట్లాడి నిర్మాణం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొన్ని అంగన్వాడీ కేంద్రాలలో నేల కంటే కిందకి ఉన్న వాటిని సరి చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు టీచర్లు, ఆయాలు కొరతను భర్తీ చేస్తామని, వంట పాత్రల సామాగ్రి, బరువు చూసే స్కేలు, పసిపిల్లల బరువు తూచే పరికరము కొని పంపిణీ చేస్తామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేసే ఆయాలు, వంట మనుషులు, టీచర్లు విధులు సరిగా నిర్వర్తించని యెడల కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే పోలీస్ కేసులు పెట్టి విచారణ జరిపి ఉద్యోగాల నుండి తీసివేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా మరియు శశి శిశు సంక్షేమ అధికారిని ఉమామహేశ్వరి, సిడిపిఓలు పాల్గొన్నారు.

# వెలుగోడులో 92.06 మి.మీ.వర్షపాతం..

**- లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ళలోకి నీరు**
**- ప్రధాన కాల్వ ఆక్రమణతోనే ఈ పరిస్థితి**

**వెలుగోడు, జూలై 5, ప్రభాతవార్త:**

వెలుగోడు మండలంలో మంగళవారం అర్ధరాత్రి నుండి కురిసిన కుండపోత వర్షానికి ప్రధాన రహదాఆరులతో పాటు లోతట్టు ప్రాంతాలన్ని జలమయ్యాయి. చెంచుకాలనీ, గండిపేట, సీపి నగర్, లక్ష్మీనగర్ కాలనీలలలో ఇళ్ళలోకి వర్షం నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులలకు గురి అయ్యారు. భారీ వర్షం కారణంగా వెలుగోడు నుండి వెల్పనూరు గ్రామాల మధ్య ఉన్న వంతెన ఎక్కి వర్షం నీరు ప్రవహించడంతో రెండు గ్రామాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని ప్రధాన రహదారి వెంట ఉన్న మురుగు కాల్వపై అక్రమ కట్టడాలు కట్టడంతో వర్షం నీరు, మురుగు నీరు నేరుగా వెళ్ళే మార్గం లేక నీరంత రపధాన రహదారిపై ప్రవహించి ఇళ్ళలోకి నీరు వస్తున్నదని వెంటనే అక్రమ కట్టడాలను తొలగించాలని ప్రజలు అధికారులను, పాలకులను కోరారు. దీంతో వారు స్పంధించి పట్టణంలో పర్యటించి జేసిబిలతో వర్షం నీరు బయటి వెళ్ళేల చేశారు. గ్రామ సర్పంచ్ వేల్పుల జైపాల్, ఎం.పి.పి. లాలం రమేష్ ఆధ్వర్యంలో వరద భాధితులకు అన్నదాన కార్యక్రమం చేశారు.



# సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

**- ఎమ్మెల్యే శ్రీదేవమ్మ**



**తుగ్గలి, జూలై 5, ప్రభాతవార్త**

రాష్ట్రంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పగడిరాయి, కొత్తూరు గ్రామాల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటరీలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆ గ్రామ సర్పంచ్ సౌజన్య, ఎంపిపి ఆదెమ్మ, స్థానిక వైసిపి నాయకులు జగన్నాథ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ గౌరవ సలహాదారుడు హనుమంతు, ఎంపిపి భర్త రంగన్నలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి గత నాలుగేళ్లలో లబ్దిదారులకు చేకూరిన లబ్దిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాట్లాడుతూ సిఎం జగన్ నిర్ణయాలతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. గత టిడిపి పాలనలో చంద్రబాబు దోపిడీ చేయడం, పచ్చనేతలకు పంచిపెట్టడం తప్ప చేసిందేమీ లేదన్నారు. జగనన్న పాలనలో ఏ ఇంటికి వెళ్లినా సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ప్రతి గడపలోనూ లబ్దిదారులు సంతోషంగా చెబుతున్నారన్నారు. ప్రతి ఇంటికి వాలంటరీలు వెళ్లి అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలను అందించడం దేశంలోనే కేవలం జగనన్నకే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి పులికొండ నాయక్, మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్, సచివాలయ మండల కన్వినర్ హనుమంతు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ హుస్సేన్, వైస్ ఎంపిపిలు మల్లికార్జున, ఎర్రనాగప్ప, రాతన మోహన్‌రెడ్డి, ఉమా మహేశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, తుగ్గలి మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రామకొండ సుధాకర్‌రెడ్డి, రాంపల్లి, నాగభూషణం రెడ్డి, కడమకుంట్ల అమర్‌నాథ్‌రెడ్డి, అట్ల గోపాల్ రెడ్డి, రంగనాథ్‌రెడ్డి, నునసరాళ్ల రంగారెడ్డి, గుంత రఘు, భీమా నాయక్, రాంపురం, గంగాధర్, ఓబులేష్, గోవిందరాజులు, శభాష్‌పురం రాఘవరెడ్డి, ఉప్పర్ల పల్లె ఉపసర్పంచ్ రామాంజనేయులుతో పాటు పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని నల్లమల్ల అడవుల్లో పెద్ద పులుల సంరక్షణ మరియు పులుల సంతతి పెరుగుతుందా.! లేక తరుగుతుందా..? పెద్దపులి మనగడ వాటి స్థితిగతులు అవి ఏ కాలంలో సంతతి పెంచుకుంటాయి వాటి కలయిక ఎప్పుడు నుంచి ఎప్పటిదాకా జరుగుతుంది అనే విషయాలపై.. ప్రభాతవార్త తెలుగు దినపత్రిక పాఠకులకు ప్రత్యేక కథనాన్ని అందించనుంది..

*ఆత్మకూరు ప్రభాతవార్త :*

● వివరాలు 2లో

- **దేశంలోనే పెద్దపులుల సంరక్షణ నిలయంగా ఆత్మకూరు**
- **ఒక ఆడపులి ఎన్నిసార్లు జన్మనిస్తుంది..**
- **ఎన్‌టీసీఏ పెద్దపులుల సంతతిపై సంరక్షణ జీఓలు విడుదల చేశారా?**



# నల్లమలలో పెద్దపులి.. సంతతి పెరగనుందా..!?

# విద్యార్థుల తల్లిదండ్రులతో.. రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ఫోన్

**నంద్యాల విద్య, జూలై 5, ప్రభాతవార్తః**



ట్రింగ్... ట్రింగ్... అంటూ ఫోన్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ ఫోన్‌ల ద్వారా సమాచారాన్ని తెలుసుకోవడం విద్యాశాఖ ప్రక్షాళన ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఒకభాగమని చెప్పవచ్చు. బుధవారం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో జిల్లాల వారిగా ర్యాండమ్‌గా ఫోన్‌చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాలో...నేను ప్రవీణ్ ప్రకాష్‌ను రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీని అమరావతి నుంచి మాట్లాడుతున్నాను మీ అబ్బాయికి జగనన్న విద్యాకానుక కిట్లు అందాయా? షూషు అందాయా? బ్యాగ్ అందిందా, స్కూల్ యూనిఫాం కుట్టించుకున్నారా? కొత్తబ్యాగ్ స్కూల్‌కు వేసుకెళ్తున్నారా అంటూ వివిధ ప్రశ్నలను తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆ తల్లిదండ్రులు పాఠశాల నుంచి అందిన వస్తువుల గురించి సవివరంగా తెలిపారు. చాల మంది తల్లిదండ్రులు యూనిఫాం ఇంకా కుట్టించలేదంటూ కుట్టించినాక వేసి పంపుతామంటూ సమాధానం ఇచ్చారు. ప్రతి పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లలో పుస్తకాలతో పాటు నోటు బుక్కులు, షూష్, యూనిఫాం, బ్యాగ్ వంటివి సరఫరా చేస్తున్నారు. ఏ పాఠశాలలోను కొరత లేకుండా విద్యార్థులందరికి సరిపడా జెవికె కిట్లను ఇప్పటికే పంపిణి చేశారు. పంపిణి చేసిన కిట్ల వివరాలను అన్‌లైన్‌లో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, నమోదుచేయాల్సి ఉంటుంది. పాఠశాలలు తెరిచి 20 రోజులు కావస్తుందని ఇంకా ఏవరికి కిట్లు అందని యేడల తమకు తెలియజేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అదేశాలు జారీచేశారు. ఫోన్ల ప్రక్రియతో ఉపాధ్యాయుల్లో ఎప్పుడు ఏ సంఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడతారా అని విద్యాప్రమాణాల పెంపులో కూడ ఇదే పోకడను ప్రవీణ్‌ప్రకాష్ అవలంబించే సూచనలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

# నల్లమల లో... పెద్ద పులి సంతతి పెరుగుతుందా..!?

**(మొదటి పేజీ తరువాయి ) :**

దేశంలోనే పెదపులుల అభయరణ్యంగా ప్రసిద్ధిగాంచిన నల్లమల అడవిలో పులులు ఎందుకు వరుసగా మృత్యువాత పడుతున్నాయి వాటికి కారణాలు ఏమిటి తెలియాల్సి ఉన్నప్పటికీ కొన్ని పులులు వయసు మీద పడడంతో అనారోగ్యం కారణాలవల్ల మృత్యు ఘోష వినిపిస్తున్నాయి మరోవైపు జాతీయ రహదారి గుర్తింపు పొందిన ఎన్ హెచ్ 340 %\% రహదారి మీద వాహనాల ప్రమాదాలకు పులులు మృతిచెందిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి నల్లమల్ల పెద్దపులుల అభయారణ్యంలో శ్రీశైలం నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు పరిధిలో దాదాపుగా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో 60. కి పైగా పెద్ద పులులు కూన పిల్లలు ఉన్నట్లు ప్రపంచ పెద్ద పులుల దినోత్సవం రోజు దేశ ప్రధాని నరేంద్ర మోడీ పెద్దపులుల యొక్క ఘనంగాలను ప్రకటించడం జరిగింది నల్లమల్ల అటవీ ప్రాంతంలోని పెద్ద పులుల సంతతి అధికంగా పెరుగుతుందని ఆత్మకూరు డివిజన్ అటవీ శాఖ అధికారుల గణాంకాలు తెలుపుతున్నాయి వాస్తవానికి పెద్ద పులుల సంఖ్య నల్లమల అటవీ ప్రాంతంలో పెరిగిందా..? లేక తరుగుతుందా అనే వాస్తవ విషయాలు వెలుగులోకి రావాల్సి ఉందిఆడ పులి మగ పులి ఏ కాలంలో వాటి యొక్క సంతతిని పెంచుకుంటాయి

వర్షాకాలం ప్రారంభం సమయంలో చలి చలిగా వేడివేడిగా ఉన్న ప్రదేశంలో ఒక ఆడ పులి మగ పులి కలిసి వాటి యొక్క కలయికను జరుపుకోవడం జరుగుతుంది ఇవి అరుదైన ప్రదేశాలలో వీటిని సంబోధించుకుంటాయి ఒక ఆడ పులి గర్భం దాచింది అంటే దాదాపు 2 నుంచి 4 పులుల వరకు జన్మనిస్తుంది పెద్దపులి సంరక్షణపై అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ముందస్తుగానే వాటి యొక్క ఉనికిని గుర్తిస్తే కూన పులి పిల్లల్ని సంరక్షణ చేసుకోవచ్చు ఈ ఆడ పులి దాని జీవితకాలం 20 సంవత్సరాల పైగా జీవిస్తుంది ఇది కేవలం 1 నుంచి3 సార్లు మాత్రమే తమ పిల్లలకు జన్మనిస్తుంది ఒకసారి మగ పులి ఆడపులితో కలయిక జరిగిందంటే అది మళ్లీ అటువైపు తిరిగి చూడదని అటవీ శాఖలో ఐఎఫ్ ఎస్ నుంచి ఎస్ ఎఫ్ ఎస్ స్థాయి అధికారుల వరకు చర్చించుకుంటున్నారు వీటి యొక్క కలయికతో ఆరు సంవత్సరాల నుంచి 8 సంవత్సరాల వరకు ఉంటుంది ఇవి అడవిలో బయలు ప్రదేశం సుతిమెత్తనైన గడ్డి ప్రదేశాలు ఉండాలి వాతావరణం చల్లగా వేడిగా ఉండే చోట వీటి యొక్క కలయిక జరుగుతుందని ఎన్ టి సి ఏ అధికారులు గుర్తించారు పెద్ద పులుల సంతతి ప్రతి సంవత్సరం జూన్ జులై ఆగస్టు మాసాలలో వీటి యొక్క సంతతిని సంబోధించు కుంటాయి

**నల్లమలలో పెద్దపులులు ఎందుకు మృత్యు ఘోష పడుతున్నాయి**

జాతీయ జంతువుగా గుర్తింపు పొందిన పెద్దపులి నల్లమల అడవి దేశానికి ఆదర్శంగా నిలిచాయి ప్రతి సంవత్సరం ఏదో ఒకచోట పెద్దపులులను మృత్యు ఘోష వెంటాడుతూనే ఉంది అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఎన్నో పెద్దపులులు మృతి చెందిన సంఘటనలు కళ్ళ ముందరనే చూస్తున్నాం అయితే వీటిని సంరక్షణ చేయాల్సిన అధికారులు మాత్రం పెద్దపులి యొక్క మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని చెప్పవచ్చు మరోవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం వీటి సంరక్షణ కోసం లక్షల రూపాయల నిధులు అటవీ శాఖఆధ్వర్యంలో ఖర్చు చేయనున్నారు కొన్ని రోజుల క్రితం ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే రహదారిలో ఓ పెద్దపులి రోడ్డుకు అడ్డంగా వెళ్తున్న విషయాన్ని గమనించిన వాహనదారులు ఆ పులిని చూసి అక్కడే నిలిచిపోయారు గత సంవత్సరంలో ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో ఓ రేంజ్ లో పెద్దపులి అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన అందరికీ తెలిసిన విషయమే అడవిలో ఎన్నో పులులు మృత్యు ఘోష వినిపిస్తూనే ఉన్నాయి

**దేశంలో పెద్దపులుల సంరక్షణ కోసం ఎన్ టి సి ఏ ప్రత్యేక ఆదేశాలు జారీ**

దేశంలో పెద్ద పులుల సంరక్షణ కోసం ఎన్ టి సి ఏ బృందం ప్రత్యేక ఆదేశాలు అటవీ శాఖ ఉన్నతాధికారులకు 2018 సంవత్సరంలో ఆదేశాలు జారీ చేశారు అడవుల్లో పెద్దపులుల కలయిక ఎప్పుడు జరుపుకోవాలి అని ఆదేశాలను ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఐఎఫ్ ఎస్ అధికారి నళిని మోహన్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వైడ్ లైఫ్ అధికారి ఆదేశాలు జారీ చేశారు 2015 సంవత్సరంలో ఎన్ టి సి ఏ బృందం ఇచ్చిన ఆదేశాలను ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వీటిని అటవీశాఖ అధికారులు అమలు చేస్తున్నారు



**ఈ విషయంపై ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ అలెన్ చాంగు తేరాన్ ప్రభాతవార్త తెలుగు దినపత్రిక వివరణ కోరగా**

నల్లమల అడవి ప్రాంతం ఆత్మకూరు డివిజన్ వన్య ప్రాణి విభాగంలో పెద్దపులుల సంరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని తెలిపారు పెద్దపులుల సంరక్షణపై సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే కఠినమైన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు ప్రస్తుతం వన్యప్రాణి డివిజన్ పరిధిలో పెద్ద పులుల సంరక్షణ పై ప్రత్యేక నిఘా వర్గాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని వివరించారు ఆత్మకూరు వన్యప్రాణి అటవీ డివిజన్ పరిధిలో జన సంచారం లేకుండా నిషేధం చేయడం జరిగిందన్నారు పెద్ద పులుల సంతతి కలయిక జరుగుతున్న నేపథ్యంలో మనుషుల మనగడ కనిపిస్తాయి అవి ఎక్కడికో వెళ్లిపోతాయని చెప్పారు రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడు నెలల పాటు జనసంచారం నిషేధించడం జరిగిందన్నారు

## సీనియర్స్, జూనియర్స్‌ల మధ్య.. నలిగిపోతున్న కమలం పార్టీ..!

**(మొదటి పేజీ తరువాయి ) :** జిల్లాలోను పట్టణాల్లో కమిటీలు ఉన్నాయి. మోర్చలోను ఒక్కొక్కదానికి అఫీస్ బేరర్స్‌తో కలిపి 200 మంది సభ్యులుంటారు. అందులో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ, వ్యవసాయ కమిటీ, మహిళా కమిటీ, యువ కమిటీ, ఓబిసి మైనార్టీల కమిటీలు ఏర్పాటు అయినప్పటికి ఈ కమిటీలు నామమాత్రంగానే ఉన్నాయని అరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా కార్యక్రమం చేపట్టాలంటే డబ్బుతో కూడుకున్న విషయం. సీనియర్లకు, జూనియర్లకు సమన్వయం లేకపోవడంతో పార్టీలో అంతర్గత పోరు కొనసాగుతుంది. రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన పురంధేశ్వరీ బిజెపిలో అంతర్గత పోరుకు పులిస్టాప్ పెట్టెవిధంగా ప్రయత్నించి బిజెపి పార్టీని బలోపేతం చేసి జిల్లాలో పార్టీకి నూతనోత్సవం తెప్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని బిజెపి అభిమానులు కోరుతున్నారు.

## కెజిబివి సీట్లను పక్కదారి పట్టించిన ఎస్ఎస్ఏ పిఓ



**కర్నూలు విద్య, జూలై 5, ప్రభాతవార్త:** ఉమ్మడి కర్నూలు జిల్లాలో కస్తూరిబా పాఠశాలకు 2023 విద్యాసంవత్సరానికి సంబంధించిన సీట్లను మధ్యవర్తుల ద్వారా అమ్ముకుంటున్నారు. దీనిపై జిల్లా కలెక్టరు విచారణ చేసి అర్హులైన వారికి సీట్లు ఇవ్వాలని పిడిఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థునులకు, మరియు తల్లిదండ్రులు లేని అనాధలకు పిల్లలకు బ్రతుకుతెరువు కోసం వలసలు వెళ్లుతున్న వారి కోసం ప్రవేశపెడితే వాటిని ఇష్టానుసారంగా ఎమ్మెల్యేలకు 10 నుండి 15 వరకు ఇచ్చారు అని అందులో ఎటువంటి రోస్టర్ ప్రకారం సీట్లు భర్తీ చేయలేదు. కేవలం అధికార పార్టీ వారు చెబితే సీట్లు ఇచ్చేశారన్నారు. కర్నూలు జిల్లా అంటే వలసలకు నిలయం అలాంటప్పుడు ఇదే ప్రజాప్రతినిధులతో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శితో మాట్లాడించి అదనంగా కస్తూరి పాఠశాలల ఏర్పాటుకు ప్రయత్నం చేయలేదన్నారు. సీట్ల విషయంలో నిష్పక్షంగా వ్యవహారించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున అందోళన చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు వీరేష్, నరసింహులు, ప్రతాప్, అఖీల్, వినోద్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రామవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



**అవుకు, జూలై5, ప్రభాతవార్త:** అవుకు మండలంలోని రామవరం మరియు లింగంబోడు గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రామవరం గ్రామ సర్పంచ్ మనోహర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మనోహర్ మాట్లాడుతూ మొదటగా లింగంబోడు గ్రామంలో ఆ తరువాత రామవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## మైనర్ డ్రైవింగ్‌లపై స్పెషల్ డ్రైవ్...



**కర్నూలు క్రైమ్, జూలై, 05, ప్రభాతవార్త :** కర్నూలు పట్టణ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కర్నూలు ట్రాఫిక్ డిఎస్పీ నాగభూషణం గారి ఆధ్వర్యంలో కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కర్నూలు నగరంలోని ముఖ్యమైన ప్రదేశాలలో మైనర్ డ్రైవింగ్ లపై ప్రత్యేక దృష్టి సారించి మోటారు వాహనాల చట్టం ఉల్లంఘనల పై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కర్నూలు కర్నూలు నగరంలోని రాజ్ విహార్ సి క్యాంప్ ఓల్డ్ ఈద్గా చెన్నమ్మ సర్కిల్‌లో మోటర్ వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న 15 మంది మైనర్ల పై ట్రాఫిక్ నిబందనల ఉల్లంఘనల కేసులు నమోదు చేసి రూ.30525 జరిమాన విధించడం జరిగింది. మైనర్ డ్రైవింగ్ చేసిన వాహనదారులకు కర్నూలు నగరంలోని కొత్తపేట దగ్గర ఉన్న కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన దగ్గర ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని త్రిబుల్ రైడింగ్ వెళ్లకూడదు సెల్ఫోన్ డ్రైవింగ్ చేయకూడదు రాంగ్ రూట్ వెళ్లకూడదని త్రిబుల్ రైడింగ్ పోకూడదు హెల్మెట్ ధరించవలెనని రోడ్డు ప్రమాదములు వలన నష్టముల గురించి కర్నూలు ట్రాఫిక్ డీఎస్పీ వివరించారు. ప్రత్యేకగా మైనర్ డ్రైవింగ్ చేసిన వాహన చోదకుల తల్లిదండ్రులను పిలిపించి వారికి పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని చెప్పడం జరిగిందన్నారు. అంతే కాకుండా మైనర్లచే ఇంకేప్పుడు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించము అని ప్రతిజ్ఞ చేయించారు.

## భారి వర్షం..పొంగిన వాగులు



**కొత్తపల్లి, జూలై5 ,ప్రభాతవార్త ;** మండలం లోని పలు గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగాయి. జిల్లాలో అత్యధికంగా 103.8మి.మి వర్షపాతం నమోదు అయింది. మంగళవారం రాత్రి 11 గంటలకు వర్షం ప్రారంభమయ్యి బుధవారం తెల్లవారుజామున వరకు వర్షం కురిసింది. నందికుంట, బావాపురం, శివపురం, సింగరాజుపల్లి, పెద్దగుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, ఎదురుపాడు తదితర గ్రామాల్లో ప్రధాన రహదారి పై వర్షపు నీరు ఆగడంతో ఆత్మకూరు పట్టణానికి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ముసలిమడుగు గ్రామంలో ముస్లిం కాలనిలో రహదారి పై వర్షపునీరు ఆగింది. కొత్తమాడుగుల నుంచి దుద్యాల వచ్చే దారిలో సుద్దవాగు పొంగి రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎం. లింగాపురం గ్రామంలో ప్రధానరహదారి పై వర్షపు నీరు ఆగడంతో జారిపడుతున్నామని వాహనదారులు అవేదన వ్యక్తం చేశారు.

## గురకుల పాఠశాలలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానం

**జూపాడుబంగ్లా, జూలై 5 ప్రభాతవార్త**

2023–24 విద్యా సంవత్సరానికి గాను ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాలో 6,7,8,9 తరగతుల్లో మిగిలి వున్న సీట్ల భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన అభ్యర్థులు తమకు సమీపంలో వున్న గురుకుల పాఠశాలలో దరఖాస్తులు అంజేయాలని కోరారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, రెండు పాసుపోర్టు సైజ్ ఫోటోలు జతపరిచి ఈ నెల 7 వతేదిలోగా ప్రవేశం కోరిన పాఠశాలలో అందజే యాలన్నారు. పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ నెల 8వతేది ఉదయం గంటలకు వారు దరఖాస్తు చేసుకున్న పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

## విధ్యార్థులు చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలి




**మంత్రాలయం, జూలై 5, ప్రభాతవార్త:** ప్రస్తుతం విద్యనభ్యసించే విధ్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రొఫెసర్ అమర్‌నాథ్‌రెడ్డి, రమేష్, నాగసుబ్బారెడ్డి, శివారెడ్డిలు అన్నారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ శిక్షణా తరగతులు రెండవ రోజు వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా మతతత్వంలోకి తీసుకువెలుతున్నట్లు తెలిపారు. విధ్యార్థులు ఎక్కువగా మూఢ నమ్మకాలు నమ్మవద్దని సూచించారు. దేశస్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణత్యాగాలు చేసిన ఘనత ఏఐఎస్ఎఫ్‌కు ఉందని పేర్కొన్నారు. కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్దం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రకమంలో సోమన్న, శ్రీరాములు, కుళ్ళాయిస్వామి, చిరంజీవి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పల్లెనిద్ర నిర్వహించిన భూమా కిశోర్‌రెడ్డి



**ఉయ్యాలవాడ, జూలై 5, ప్రభాతవార్త:** ఉయ్యాలవాడ మండలం హరివరం గ్రామంలో బిజెపి నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తలను ఉత్తేజ పరిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ధరల పెరుగుదలను అరికట్టలేక విఫలమయిందన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయన్నారు. ధరల పెరుగుదల ఇలాగే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో వైయస్ఆర్ ప్రభుత్వానికి నూకలుచెల్లినట్లేనని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో భూమా వెంట బిజెపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డెంగ్యూ పై అవగాహన ర్యాలీ



**బనగానపల్లె, జూలై5, ప్రభాతవార్త:** డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా టంగుటూరు పీహెచ్‌సీ వైద్యడు శివశంకరుడు బనగానపల్లె మండలంలోని కైప గ్రామంలో బుధవారం డెంగ్యూ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకరుడు మాట్లాడుతూ కీటకజనిత వ్యాధులలో ఒకటైన డెంగ్యూ దోమకాటు వల్ల వస్తుందని ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా నీటి నిల్వలు లేకుండా ఫ్రైడే డ్రై డే పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. అలాగే వర్షా కాలంలో దోమలు పెరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు తెలియజేశారు. సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ మంగమాంబ గంగిపూజ



**ఆలూరు రూరల్, జూలై 5, ప్రభాతవార్త :** శ్రీశ్రీశ్రీ ఆది పరాశక్తి స్వరూపిణీ శ్రీ మహాయోగి మంగమాంబ దేవి గంగిపూజ కరిడిగుడ్డం దేవస్థాన కమిటీ, భక్తమండలి సభ్యులు, గ్రామ పెద్దల ఆద్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. కురుకుంద, మణేకుర్తి, కరిడిగుడ్డం గ్రామస్తులు ఊరేగింపుగా తీసుకొచ్చి గడేకల్ గ్రామంలో నందికోలు సేవతో గంగిపూజ నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, మహామంగళారతి తదితర పూజలతో పాటు సప్తభజన కార్యక్రమం నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ పూజల్లో ముద్దనగేరి సర్పంచ్ సుధారెడ్డి, కురుకుంద ఎంపిటిసి ఏసప్ప, వైసిపి నాయకులు వెంకటేష్‌లు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి రైతన్నలు మంచి దిగుబడులు సాధించాలని అమ్మవారికి సప్తభజన కార్యక్రమం నిర్వహించినట్లు కరిడిగుడ్డం భక్తమండలి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని మొక్కులు తీర్చుకున్నారు.

## గాయపడ్డ వైసీపీ కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే



**చాగలమర్రి, జూలై5, ప్రభాతవార్త:** చాగలమర్రి చెంచుకాలనీలో మోటర్ సైకిల్ వెలుతూ గంగాధర్ అనే వైసీపీ కార్యకర్త గాయపడడం జరిగింది. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విషయం తెలుసుకుని హుటాహుటిన కేరళ ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న గంగాధర్‌ను పరామర్శించి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు ఆయన సూచించారు. ఆయన వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ మహమ్మద్ సోహేల్, మండల ఉపాధ్యక్షులు ముల్లా రఫి, కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, ముల్లా ఖాదర్ బాషా తదితరులు ఉన్నారు.

## క్షయవ్యాధి నివారణ అందరి బాధ్యత

**పాములపాడు రూరల్, జూలై5, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని వేంపెంట గ్రామంలోని చెంచెగుడెంలో బుధవారం క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. సూపర్ వైజర్లు రవికుమార్, మస్తానయ్య, సౌజన్య మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో క్షయవ్యాధినిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఆధునిక పరికరాలు ఉన్నట్లు తెలిపారు. రోగికి పోషకాహార నిమిత్తం ప్రభుత్వం నెలకు రూ.500లు అందచేస్తున్నట్లు తెలిపారు.

**వైయస్ఆర్‌భీమా ఆర్థికసహయం అందచేత :**

మండల పరిధిలోని వేంపెంట గ్రామంలో మద్దూరు వెంకటరమణ అనే వ్యక్తికి సహజమరణం పొందారు. మృతుడి భార్య ఎల్లమ్మకు వైయస్ఆర్‌భీమా పథకం కింద ప్రభుత్వం అందించి ఆర్థిక సహయాన్ని సర్పంచ్ మాణిక్యమ్మ అందచేశారు.

## పట్టుబడిన అక్రమ మద్యం, గుట్కాను ప్యాకెట్లను ధ్వంసం చేసిన పోలీసులు



**బేతంచెర్ల, జూలై5, ప్రభాతవార్త:** గత సంవత్సర కాలం నుండి మండలంలో పట్టుబడిన అక్రమ మద్యం, గుట్కా ప్యాకెట్లను పోలీసుల ఉన్నతాధికారుల ఆదేశాలతో సీఐ ప్రీతమ్‌రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్‌లు బుధవారం ధ్వంసం చేశారు. వివరాల మేరకు కర్నాటక నుండి వివిధ రూపాల్లో తరలిస్తున్న అక్రమ మద్యాన్ని, నాటుసారాను సీజ్‌చేసి కేసులు నమోదు చేయగా స్వాధీనం చేసుకున్న దాదాపు రూ. 2లక్షల విలువైన మద్యాన్ని, రూ. లక్ష విలువైన గుట్కా ప్యాకెట్లను ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## జగనన్న సురక్షను ప్రజలు వినియోగించుకోవాలి



**సూగూరు(మంత్రాలయం), జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని వైసిపి మండల కన్వీనర్ భీంరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సూగూరు, బూదూరు గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీ ంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పదకొండు రకాల సేవలను రూపాయి చలానాకట్టకుండా ఈ కార్యక్రమంలో ఉచితంగా పొందవచ్చని తెలిపారు. అనంతరం లబ్దిదారులకు ధృవపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సచివాలయ కో-కన్వీనర్ రాఘవేంద్రాచారి, ఎంపిడిఓ మణిమంజరి, సర్పంచ్ శంకరమ్మ, ఎంపిటిసి సత్యమ్మ, ఉప సర్పంచ్ గోపినాథ్, విఆర్ఓ శ్వేతతదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్లకు ఆమోదం

**మద్దికెర, జూలై 5, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మద్దికెరలోని ఏపి మోడల్ స్కూల్ నందు 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి సంబంధించి మిగిలిన సీట్లకు ఉన్నతాధికారుల నుండి ఆమోదం వచ్చినట్లు ప్రిన్సిపల్ సరిత తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ 7,8,9వ తరగతులు ఖాళీ సీటుకు 7వ తేదీ ప్రవేశ పరీక్ష ఉండునని పాఠశాల నందు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే నిర్వహించడం జరుగుతుందన్నారు.

## రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేసిన ఎంఎల్ఏ



**మంత్రాలయం, జూలై 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాంపురం గ్రామానికి చెందిన ఎస్‌సి, ఎస్‌టి రైతులకు ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన కందులు, కొర్రల విత్తనాలను ఎంఎల్ఏ వై. బాలనాగిరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రభుత్వం 100 శాతం రాయితీపై ఈ విత్తనాలను మంజూరు చేసినట్లు తెలిపారు. కందులు నాలుగు కేజీలు, కొర్రలు 64 కేజీలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. కాబట్టి అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి రైతులు ప్రభుత్వం మంజూరు చేసిన ఈ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలకన్వీనర్ భీంరెడ్డి, ఇంఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఏడిఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ జీరా గణేష్, ఏఈఓ నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువులు సబ్సిడి కింద ఇవ్వాలి



**నందికొట్కూరు, జూలై 5, ప్రభాతవార్త:** విపరీతంగా పెరిగిపోయిన నిత్యావసర వస్తువుల ధరల వలన సామాన్య మానవుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం నిత్యావసర వస్తువులను సబ్సిడి కింద ఇవ్వాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్తానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కూరగాయలు, నిత్యావసర సరుకులతో నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి. రఘురాంమూర్తి మాట్లాడుతు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల వల్ల ప్రజలు నిత్యం వాడే కూరగాయలు, వంటగ్యాస్ ధరలు అమాంతంగా పెరిగాయని దీంతో కొనలేక పేద ప్రజలు అర్థాకలితో అలమటిస్తున్నారని కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువులను సబ్సిడి కింద ఇచ్చే ఏర్పాట్లు చేయాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆంధోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమీషనర్‌కు వినతి పరతం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, వీరస్వామి, షేక్షావలి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలి

**కొత్తపల్లి, జూలై 5, ప్రభాతవార్త:** పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని సిపియం పార్టీ మండల నాయకులు ఎన్. స్వాములు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బొల్లు ప్రసాద్, జిల్లా నాయకులు దినేష్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఎ ర్రమఠం గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలను వారు పరిశీలించారు. మండలంలోని పాఠశాలలో ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులతోనే విద్యను అంధించడం జరుగుతున్నదని, సింగరాజ్‌పల్లెలో 74 మంది విద్యార్థులు ఉండగా కేవలం ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారని, కొక్కెరంచలో 179 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు, ఎర్రమఠం గ్రామంలో 105మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు, ఎదురుపాడు గ్రామంలో 98 మంది విద్యార్థులు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారని, ఒకొక్క పాఠశాలకు కనీసం 8 నుంచి 10 మంది ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట సబ్జెట టీచర్లను నియమించకుండా ప్రభుత్వం ఇద్దరు ముగ్గురు టీచర్లతోనే పాఠశాలలను నడపడం వలన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలేదని వారు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని వారు డిమాండ్ చేశారు.

## సచివాలయం-2లో జగనన్న సురక్ష కార్యక్రమం



**గడివేముల, జూలై05, ప్రభాతవార్త ;** గడివేముల సచివాలయం-02 వద్ద బుధవారంనాడు అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సేవలపై అర్జీలు పెట్టుకున్న వారికి 11 రకాల పౌర సేవలపై 622 సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ అబ్దుల్ ఖలిక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్. బి. చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ సిబ్బందికి సమావేశం



**కౌతాళం, జూలై05, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన కౌతాళంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం మధ్యాహ్నం ఉపాధిహామీ సిబ్బందితో ఎంపీడీఓ, ప్రోగ్రామ్ ఆఫీసర్ సుబ్బరాజు సమావేశమయ్యారు. లేబర్ రిపోర్టింగ్, ఆధార్ సీడింగ్, ఎన్ఎంఎంఎస్ యాప్, హార్టికల్చర్ ప్లాంటేషన్స్ కింద పిట్టింగ్ అండ్ ప్లాంటింగ్, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ల నిర్మాణాలు తదితర అంశాలపై చర్చించారు. ఇచ్చిన లక్ష్యాలను సిబ్బంది పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యక్రమ అధికారి జుబీర్‌అహ్మద్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ రఫిక్, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌కు ఆత్మీయ సన్మానం



**జూపాడుబంగ్లా, జూలై 5 ప్రభాతవార్త :** కల్లూరు మండలం చిన్నటేకూరులోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేసిన చంద్రశేఖర్ ఇటీవల పదవీ విరమణ పొందారు. జూపాడుబంగ్లాలోని గురుకుల పాఠశాలలో 2007 సంవత్సరం నుండి 2012 సంవత్సరం వరకు చంద్రశేఖర్ పిడిగా పనిచేశారు. అదే విధంగా ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎఫ్ యూనియన్‌కు రాష్ట్ర అధ్యక్షుడుగా ఆయన పనిచేశారు. ఉద్యోగులకు ఆయన చేసిన సేవలు, జూపాడుబంగ్లాలోని పాఠశాల అభివ ృద్దికి క ృషి చేయడంతో గుర్తింపుగా చంద్రశేఖర్‌కు ప్రిన్సిపల్ సత్యనారాణ మూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్బంగా పులువురు వక్తలు చంద్రశేఖర్ చేసిన సేవలను కొనియాడారు. అన ంతరం ఆయనను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు శాలువ,పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సత్యనారాయణ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ కుమారస్వామి,లైబ్రెరియన్ కంబయ్య, పిడిలు భాష్కరెడ్డి, గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే బీసీ జన్మదిన వేడుకలు



**బనగానపల్లెరూరల్, జూలై 5, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయ ఆవరణంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి జన్మది నాన్ని పురస్కరించుకుని ఆయన సతీమ ణి,రాష్ట్ర థాయ్‌బాక్సి ంగ్ చైర్‌పర్స న్ బీసీ ఇందిరారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయ కులు,కార్యకర్తల సమక్షంలో ఆమె కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అదే విధంగా బీసీ ఇందిరారెడ్డితోపాటు టీడీపీ నాయకులు,బీసీ అభిమానులు, కార్యకర్తలు బీసీ జనార్దన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రతిష్మాత్మకంగా చేపట్టిన యువగళం పాదయాత్ర బుధవారం కొవ్వూరు నియోజకవర్గంలో నిర్వహిస్తుండగా పాదయాత్రలో ఉన్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి నారా లోకేశ్ స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ బీసీ జనార్ధన్‌రెడ్డి అన్న ఆయురారోగ్యాలతో,అష్టఐశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని దేవుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరి శీనయ్య,పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్,ఎస్టీసెల్ నంద్యాల పార్లమెంట్ అధ్ యక్షులు కృష్ణనాయక్,రిటైర్డ్ హెచ్ఎం ఐ.ఎన్.పక్కీరారెడ్డి,వార్డుమెంబర్ లాయర్ నాగే ంద్రారెడ్డి,బొబ్బల మహేశ్వరరెడ్డి,టిప్‌టాప్ కలాం,గుండం విజయనాగేశ్వరరెడ్డి,టీడీపీ నాయకులు,కార్యకర్తలు,బీసీ అభిమానులు పాల్గొన్నారు.

## రోగుల పట్ట నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



**కోవెలకుంట్ల, జూలై 5, ప్రభాతవార్త :** ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్ యం వహిస్తే కఠిన చ్యలు తప్పవని డియంహెచ్ఓ వెంకటరమణ హెచ్చరించారు. బుదవారము మండల పరిదిలోని రేవనూరు పిహెచ్‌సి డియంహెచ్ఓ వెంకటరమణ అకస్మికంగా తనికీ చేశారు. అక్కడి ఉన్న ఓపిని తనికీ చేస్తు ఇక్కడ ఎవరుపేషట్లు లేక పోవడము మీరు రోగుల పట్ల నిర్లక్ష ్యంవహిస్తున్నారని అందుకే ఇక్కడ ఓపి తక్కువగా ఉందని చెప్పారు. అనంతరము ల్యాబ్, అలాగే మండల గదిని అయన తనికీ చేశారు. ఈసందర్బము గర్బిణీ స్త్రీలు, 0నుండి 5సంవత్సరాల పిల్లలకు వైద్యము తదితర విషయాలపై అరా తీవారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్లలో ఉన్న పిల్లల నుండి కూడా అరా తీశారు ముఖ్యంగా అసుపత్రి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు.

## మురుగుకాల్వలు శుభ్రం చేయని మున్సిపల్ యంత్రాంగం



**-ముక్కుపిండి వసూలు**
**చేస్తున్న చెత్తపన్ను, కొళాయి పన్నులు..**

**కర్నూలు మున్సిపల్, జూలై 5, ప్రభాతవార్త:** స్థానిక సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యహరిసుతన్నారని సిపిఎం నగర కమిటీ సభ్యులు ఆర్ కృష్ణ, కె రామకృష్ణలు విమర్శించారు. బుధవార పేట 15వ వార్డు నందు ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న నాయకుల దృష్టికి వచ్చిన సమస్యలు సిపిఎం నాయకులు మున్సిపల్ అధికారులపై ధ్వజమెత్తారు. ఈసందర ్భంగా వారు మాట్లాడుతూ వీరుపాక్షితోట, మారెమ్మగుడి, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో మురుగుకాల్వలు తీయకుండా నెలల తరబడి ఉంటున్నారు. మురుగుకాల్వలు తీసిన తరువాత కూడ వారాలు గడుస్తున్నా చెత్తకుప్పలను అలాగే వదిలేస్తున్నారన్నారు. చెత్తపన్ను, ఇంటిపన్నులు, కొళాయి పన్నులు ప్రజల వద్ద నుండి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది వెంటపడి పన్నులు కట్టించుకొని స్థానిక సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మహిళల మరుగుదొడ్లు వీరుపాక్షయతోటలో కట్టించారు కానీ అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఆ మరుగుదొడ్లను బాగుచేయమని చాల సార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని విమరి ్శంచారు. మురుగుకాల్వలను శుభ్రం చేసి మరుగుదొడ్లను బాగుచేసి ఉపయోగంలోకి తేవాలని కోరారు. లేనియెడల మున్సిపల్ అఫీసు ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు కె రాముడు, బి మద్దిలేటి, మహేశ్వరమ్మ, జి రమేష్ బాబు, బి లక్ష్మన్న, ఆర్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహారం పంపిణీ



**ఆదోనిటౌన్, జూలై05, ప్రభాతవార్త ;** ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ వ్యాపా రవేత్త, భీమాస్ రెసిడెన్సి డైరెక్టర్ విట్టా రమేష్ బుధవారం ఆదోని పట్టణంలోని పది మంది పేద క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందించారు. ఇలా ఆరు నెలల పాటు పోషకాహార కిట్లను అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్బంగా విట్టా రమేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా క్షయవ్యాధి నిర్మూలనలో అందరూ భాగస్థులు కావాలని, అలాగే దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి, ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళీకృష్ణ, ఆదోని టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకున్‌భాను, జిల్లా పీపీఎం కో-ఆర్డినేటర్ డి.ఉమాపతి, జి.బాబురాజు, సిబ్బంది స్వరూప్, లలితమ్మ, మనోరంజనీదేవి, సుబ్బమ్మభాయి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎబివిపి నాయకులు అరెస్టు



**నందికొట్కూరు, జూలై 5, ప్రభాతవార్త:** విద్యార్థుల సమస్యల కోసం శాంతియు తంగా పాఠశాలలు బంద్ చేస్తుంటే పోలీసులు ఎబివిపి నాయకులను అరెస్టు చేయడం దారుణమని విద్యార్థి సంఘాలు విమర్శించాయి. బుధవారం ఎబివిపి ఆధ్వర్యంలో అధిక ఫీజులు, యూనిఫాం, పుస్తకాలు పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం విద్యార్థులపై భలవంతంగా రుద్దు తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ చేశారు. ఎబివిపి నాయకులు భానుప్రకాష్, హరి, తరుణ్, మనోజ్ ప్రైవేట్ పాఠశాలలను మూయిస్తుండగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. పాఠశాలల పనితీరుపై ఎన్నో సార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకోని వెళ్ళి పట్టించేకోవడంలేదని, 2009 విద్యా హకుక చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. 30 వేలకు పైగా ఖాళీగా ఉన్న పాధ్యాయ పోష్టులను డిఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## "నాటుసారా విక్రయాలపై సెబ్ పోలీసుల దాడులు"



**కొలిమిగుండ్ల, జులై 5, ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ కె.రఘువీరారెడ్డి ఆదేశాలమేరకు, నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ జి.వెంకటరాముడు ఆధ్వర్యంలో సెబ్ పోలీసులు కొలిమిగుండ్ల మండలంలో నాటుసారా విక్రయాలపై దాడులు నిర్వహించారు. దీంతో కొలిమిగుండ్లకు చెందిన ఎరుకల రమణ అనే వ్యక్తి నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుండి 20లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె సెబ్ ఎస్ఐ దౌలత్‌ఖాన్ తెలిపారు. నిందితుడు రమణను అరెస్ట్ చేసి, కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మిగిలిన సీట్ల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**పత్తికొండ, జూలై 5, ప్రభాతవార్త :** పట్టణంలోని ఏపి మోడల్ స్కూల్ నందు మిగిలిన సీట్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్ రేష్మ కౌసర్ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మోడల్ స్కూల్ నందు 7,8,9వ తరగతులలో మిగిలి ఉన్న సీట్ల కొరకు స్కూల్ నందు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇలా రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులకు ఈ నెల 11వ తేదీ ఉదయం 10గంటలకు స్కూల్ నందు పరీక్ష నిర్వహించి అందులో మెరిట్ ప్రాతిపదికన విద్యార్థులను తీసుకోవడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4గంటల వరకు చేయించుకోవడం జరుగుతుందన్నారు.

## మైనార్టీల అభివృద్ధే జగనన్న ప్రభుత్వ లక్ష్యం



**పాములపాడురూరల్, జూలై 5, ప్రభాతవార్త :** మైనార్టీ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ షేక్ హాజీ సుకూర్ అన్నారు.మండల కేంద్రమైన పాములపాడులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత మాజి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి ముస్లీం అభ్యున్నతి కోసం విద్య ,ఉద్యోగాల్లో 4శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు.తండ్రి ఆశయాలను నేరవేరుస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి హజ్‌యాత్రికులకు రూ.80వేల ప్రయాణ రాయితి కల్పించారన్నారు.మసీదులో పనిచేస్తున్న ఇమాములకు రూ పదివేలు,మౌజన్లకు రూ.5వేలు అందచేస్తున్నట్లు తెలిపారు.నందికొట్కూరు ఎంఎల్ఏ తొగూరు ఆర్థర్ ప్రజాసమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు.వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా గెలుపునకు ప్రతి ఒక్కరు తమ మద్దతు తెలుపాలని ఆయన కోరారు.కార్యక్రమంలో కో-ఆప్టెడ్ మెంబరు ముర్తుజావలి,ఉర్దూస్కూల్ చైర్మన్ షేక్‌షావలి,వైకాపా నాయకులు తిరుపతయ్య,ఎల్ రమణారెడ్డి,అంబయ్య,వికలాంగుల సంక్షేమసంఘం నాయకులు ప్రభాకర్,రజక సంక్షేమ సంఘం నాయకులు రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తులు అరెస్టు....

**కర్నూలు క్రైమ్, జూలై, 05, ప్రభాతవార్త :** ప్రభుత్వ నిబంధనల మేరకు అక్రమంగా తెలంగాణ రాష్ట్రం నుండి మద్యం సరఫరా చేసి కర్నూలు నగరంలో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్పై చిరంజీవి తెలిపారు.ఆయన తెలిపిన వివరాల మేరకు రాముడు బుధవారపేట కర్నూలు టౌన్ దస్తగిరి వెల్దుర్తి సిపిఎం కొట్టాల బుధవారపేట కర్నూలు టౌన్ పి.రామకృష్ణ అక్రమ మద్యం అమ్ము తుండగా కిసాన్ ఘాట్ నందు అరెస్టు చేసినట్లు తెలిపారు.వారి వద్ద నుండి తెలంగాణ మద్యం డెక్కెన్ బ్లూ విస్కి 15 బాటిళ్ల లైక్ యు 180 ఎంఎల్ మద్యం బాటిల్ లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

## సీనియర్ పాత్రికేయుడు నాగయ్య గుండెపోటుతో మృతి

**- కుటుంబసభ్యులను పరామర్శించిన ప్రముఖులు**
**- అశ్రునయనాల నడుమ సీనియర్ పాత్రికేయుని అంతిమయాత్ర**



**వెల్దుర్తి, జులై5, ప్రభాతవార్త :** వెల్దుర్తిలో నివాసముంటున్న సీనియర్ పాత్రికేయుడు నాగయ్య(57)గుండెపోటుతో మంగళవారం రాత్రి కన్నుమూశాడు.వెల్దుర్తి,క్రిష్ణగిరి మండలాల్లో గత 30 సంవత్సరాలుగా క్రిష్ణగిరి మండలంలో పా త్రికేయునిగా పనిచేస్తున్నారు.అయితే గత 4 నెలల క్రితం నాగయ్యకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు కర్నూలులోని ప్రైవేట్ వైద్యశాలలో స్టంట్ వేయించారు.అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆరోగ్యం బాగానే ఉంది.అయితే నిన్న రాత్రి కుటుంబసభ్యులందరితో కలిసి భోజనం చేసిన అతను ఒక్కసారిగా చెమటలు పట్టి కుప్పకూలాడు.కుటుంబసభ్యులు వైద్యసేవలకు తరలించేలోపు మృతిచెందాడు.ఈ విషయం తెలుసుకున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి ఫోన్ ద్వార కుటుంబసభ్యులను ఓదార్చి ఏ కష్టమొచ్చిన తమను ఆశ్రయించాలని కోరారు.రాష్ట్ర వైకాపా కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి వెల్దుర్తికి చేరుకొని నాగయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించి అంత్యక్రియలకై తక్షణ సహాయంను కుటుంబసభ్యులకు అందజేశారు.అదేవిధంగా ఫారిన్‌లో ఉన్న క్రిషగిరి మాజీ జడ్పీటిసి కెఇ సుభాషిణీ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు.అదేవిధంగా క్రిష్ణగిరి ఎంపిపి కంగాటి వెంకటరామిరెడ్డి,వెల్దుర్తి మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి,మండల జడ్పీటిసి దాదిపోగు సుంకన్న,రెండు మండలాల వివిధ పార్టీల మండల,గ్రామనాయకులు నాగయ్య భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.నాగయ్య మరణవార్త విషయం తెలుసుకున్న క్రిష్ణగిరి మండల మాజీ జడ్పీటిసి కెఇ జయన్న, క్రిష్ణగిరి మండల తెదేపా అధ్యక్ష కార్యదర్శులు మర్రిశ్రీరాములు ,గురుస్వామి, ఏపి ఎమ్మార్పీఎస్ నాయకులు దాదిపోగు నవీన్,వెల్దుర్తి,క్రిష్ణగిరి,డోన్ మండలాల ఏపియుడబ్ల్యూజె నాయకులు,పాత్రికేయులు నాగయ్య మృతదేహంపై పూలు చల్లి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.అందరితో మంచిగా మెలిగి ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడే పాత్రికేయుడిగా అందరి మన్ననలు పొందాడు.దీంతో కాలనీవాసులు,పాత్రికేయులు,కుటుంబ సభ్యులు,శాలివాహన సంఘం నాయకుల అశ్రునయనాల నడుమ అంతియాత్ర కొనసాగింది.నాగయ్యకు భార్య,ఇద్దరు కుమార్తెలు,ఒ క కుమార్తె ఉన్నారు.

## పురాతన బావిలను పరిరక్షించండి



**మద్దికెర, జూలై 5, ప్రభాతవార్త :** మద్దికెర మండలంలోని పెరవలి గ్రామంలో శిలా రామ కోట వీధి నందు పురాతన బావులను ఎవరు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. అంతేకాకుండ పీర్ల పండుగ సందర్బంగా స్వాములు బావిలోకి దిగి లోపల గుడిలోకి వెళ్తారని ప్రతి గత రెండు,మూడు సంవత్సరాలుగా ఆ బావి ముళ్లకంపలతో నిండి ఉండటం వల్ల ఆ సాంప్రదాయాన్ని నిలిపివేశారు. ఎంతో అందంగా మెట్టుమెట్టుకు ఒక శిల్పాన్ని కొన్ని సంవత్సరాల పాటు కష్టపడి కట్టించిన మన పెద్దల బావులను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని ప్రభుత ్వ విలువైన వస్తువులకు ఆదాయాన్నిచ్చే దేవాలయాలకు మాత్రమే భద్రత కల్పించడం ఏ మాత్రం సరికాదని ఇలాంటి బావులకు కూడా భద్రత కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## దళితులపై దాడులు,దౌర్జన్యాలు పెట్రేగిపోయాయి

**:- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టిఎం రమేష్ మాదిగ**



**ఆలూరు రూరల్, జూలై 5, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నిత్యం దళితులే లక్ష్ యంగా దాడులు, దౌర్జన్యాలు. అత్యాచారాలు, హత్యలు, భూకుంభ కోణాలు పెట్రేగి పోయాయని ఎమ్మార్పీ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టిఎం రమేష్ మాదిగ,జిల్లా అధ్య క్షుడు మా చాపురం గిడ్డ య్య మాదిగలు అన్నారు. బుధవారం ఆలూరు పట్టణంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశం జిల్లా అధికార ప్రతినిధి ఖాజీపురం రామాంజనేయులు మాదిగ,నియోజకవర్గ కన్వీనర్ కురువల్లి ఉదయ్‌కుమార్ మాదిగ,ఆలూరు నియోజకవర్గ ఇంచార్ ్జ పెద్దరాజు మాదిగల అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన టిఎం రమేష్ మాదిగ,మాచాపురం గిడ్డయ్యలు మాట్లాడుతూ దళితులపై జరగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దళితులకు రావాల్సిన స్వయం ఉపాధి 27సంక్షేమ పథకాలకు ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించి సొంత పూచికత్తుతో రుణాలు మంజూరు చేసి ఆర్థిక తోడ్పాటు కల్పించాలన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ అంబేద్కర్ విదేశీ విద్యకు నిధులు కేటాయించి దళిత యువత ఉన్నత విద్య అభ్యసించేందుకు సహకరించాలన్నారు. భూమిలేని దళిత నిరుపేదలకు ఐదెకరాల భూమి కేటాయించి బోర్లు వేయించి వ్యవసాయ రైతులుగా దళితులను గుర్తించాలన్నారు. కృష్ణపట్నం లెదర్ ఇండస్ట్రీలకు రూ.20లక్షల కోట్లు నిధులు కేటాయించి మాదిగ నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. మాదిగల చిరకాల కోరిక అయిన ఎస్సి వర్గీకరణ బిల్లును శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం బిల్లును అసెంబ్లీలో తీర్మాణించి కేంద్ర ప్రభుత్వానికి పంపి ప్రధాని మోడీతో చర్చించి ఎస్సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఏకపక్షంగా ఆమోదం తెలిపి ప్రధాని మోడీ మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు అందించాలన్నారు. అలాగే ఎస్సి,ఎస్టి అట్రాసిటి కేసుల్లో ఉన్న నింధితులకు 41ఎ సిఆర్‌పిసి నోటీసిచ్చి స్టేషన్ బెయిల్ మంజూరు చేయకుండ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిప్పగిరి,వెల్దుర్తి,ఆలూరు,హొళగుంద,హాలహర్వి మండలాల అధ్యక్షులు ప్రభాకర్ మాదిగ,మద్దిలేటి మా దిగ,వీరేష్ బాబు, ప్రకాష్ మాదిగ,సిద్ద లింగప్ప మాదిగ,ఆస్ప రి మండల అధ్యక్షు డు అట్టేకల్లు ఎల్లప్ప మాదిగ,దేవనకొండ మండల ఇంచార్జ్ చె న్నకేశవులు మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాదిగ,మండల కార్యదర్శి హరి మాది గలు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం



**కౌతాళం, జూలై05, ప్రభాతవార్త ;** మండల కేంద్రమైన కౌతాళంలోని నూతన సుంకేసుల పరమేశ్వరి గంగపుత్ర (బెస్త) సేవా సంఘం వారి ఆలయ నిర్మాణం కోసం మండల నాయకులు దేశాయ్ ప్రహ్లాద్ ఆచారి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆలయ సభ్యులైన వెంకోబా, ఉమాపతి, ఈరన్నలకు అందించారు. ఈ సందర్భంగా వారు దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ, ఉప సర్పంచ్ సక్కరి తిక్కయ్య, పాఠశాల చైర్మన్ వడ్డే రామన్న, మాజీ సర్పంచ్ అవతారం, మైనార్టీ నాయకులు సమ్మద్, వార్డు మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## తమకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం



**గడివేముల, జూలై05, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన గడివేములలోని పోలీస్‌స్టేషన్‌ఎదుట బుధవారంనాడు పెసరవాయి గ్రామానికి చెందిన ఎడమకంటి రంగమ్మ అనే మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. బాధితా మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తనకు పెసరవాయి గ్రామ పొలిమేరలో తన భర్త ఈ.గోవింద్‌రెడ్డి పేరుమీద సర్వేనంబర్ 471/2లో 11.29 ఎకరాల పొలం ఉందని, గత రెండు సంవత్సరాల క్రితం తన భర్త మరణించాడని, అప్పటి నుంచి తన మరిది కొడుకు ఈ.రామమద్దిలేటిరెడ్డి తన పేరిట రాసి ఇవ్వాలని బెదిరించాడన్నారు. వృద్ధ మహిళ అయిన తనపై దౌర్జన్యం చేస్తున్నాడని, తనకు న్యాయం చేయాలంటూ గడివేముల పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకోవడం జరిగిందని, వెంటనే పోలీసులు స్పందించి ఎస్ఐ బి.టి.వెంకటసుబ్బయ్య వెంటనే బాధితురాలు పొలం వద్దకు పోలీసులను పంపించి విచారణ చేశారు. బాధితురాలికి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో బాధితురాలు పోలీస్‌స్టేషన్ నుంచి వెనుదిరిగారు.

## జగనన్న సురక్షతో ఇంటివద్దనే సమస్యలు పరిష్కారం



**తుగ్గలి, జూలై 5, ప్రభాతవార్త** రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుతో పాటు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన పాలన అందించాలనే ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దే సమస్యల పరిష్కారానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని దీనిని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని మారెళ్ల సర్పంచ్ గౌరవ సలహాదారుడు సుధాకర్‌రెడ్డి,రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు,వైసిపి నేత రంగనాథ్‌రెడ్డిలు కోరారు. బుధవారం మండల పరిధిలోని మారెళ్ల,చెన్నంపల్లి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామాలలో కుల,ఆదాయ,కుటుంబ సభ్యుల,మరణ,జనన ధృవపత్రాలతో పాటు భూ సంబంధిత పత్రాలను ఎలాంటి సర్వీస్ చార్జెస్ లేకుండ మారెళ్ల సచివాలయం నందు ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్,బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్,ఎంపిడిఓ సావిత్రి,డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్‌లతో కలిసి లబ్దిదారులకు అందచేశారు. ఈ సందర్బంగా మారెళ్ల సర్పంచ్ గౌరవ సలహాదారుడు సుధాకర్‌రెడ్డి,రామలింగయ్యపల్లె వైసిపి నేత రంగనాథ్‌రెడ్డిలు వేర్వేరుగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్ అమలు చేస్తున్న నవరత్న పథకాలు దేశానికి ఆదర్శమన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు,జన్మభూమి కమిటీల చుట్టూ ఎన్నిసార్లు ప్రదక్షిణలు చేసినా సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. మన వైసిపి ప్రభుత్వంలో అర్హులైన ప్రతిఒక్కరికి వాలంటరీ ద్వారా సంక్షేమ పథకాలు అందచేస్తున్నామన్నారు. దీంతో రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మారెళ్ల పంచాయతీ సెక్రటరీ అంకాలప్ప,సచివాలయ విఆర్ఓ నాగలక్ష్మి,సచివాలయ సెక్రటరీ రామాంజనేయులు,ఫీల్డ్ అసిస్టెంట్లు బాలు, చంద్ర,చెన్నంపల్లిలో పంచాయతీ సెక్రటరీ రాజునాయక్,విఆర్ఓలు కృష్ణారెడ్డి, నాగేంద్ర,వైసిపి నాయకులు బి హనుమంతరెడ్డి,సుంకన్న,వడ్డే వెంకటరాముడు,రంజాన్,వైసిపి యువజన విభాగం యూత్ ప్రెసిడెంట్ వెంకటయ్య,వైసిపి ఎస్‌టి సెల్ ఉపాధ్యక్షులు సుధాకర్,సచివాలయ ఉద్యోగులు,వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ లైన్‌మెన్‌కు ఆర్థిక సహాయం



**హొళగుంద, జూలై 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో జ యరాం అనే విద్యుత్ లైన్‌మెన్‌కు ఆర్థిక సహాయం అందించినట్లు ఎస్‌డిపిఐ ఆలూరు అసెంబ్లీ నాయకులు ఎస్ఎండి షఫీ, నాయకులు భాషా,అబీబ్,రహంతుల్లా, హమీద్,అబ్దుల్ రహిమాన్‌లు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్ల క్రితం జయరాం విద్యుత్ పనిచేస్తుండగా షార్ట్‌సర్క్యూట్‌కు గురైస్పర్శ లేకుండ బెడ్‌కే పరిమితమయ్యాడని తెలిపారు. ప్రతి నెల వాటర్‌బెడ్ మార్చాలని తమ దృష్టికి రావడంతో జయరాం ఆర్థిక పరిస్థితిని గమనించి జయరాం ఇంటికి వెళ్లి ఆయన యోగక్షేమాలు తెలుసుకుని తమవంతుగా ఆర్థిక సహాయం నగదు రూపంలో అందించినట్లు తెలిపారు. జయరాం త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. దీంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

## వసుధ ఫౌండేషన్ సహకారంతో పేదలకు ఆర్థిక సహాయం - టంగుటూరి శీనయ్య



**బనగానపల్లెరూరల్, జూలై5, ప్రభాతవార్త:** బనగా నపల్లె పట్టణానికి చెందిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు మరియు టీడీపీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆర్థిక సహకారంతో బనగానపల్లె నియోజకవర్గంలోని 8 మంది పేదలకు ఆరోగ్యం సరిగాలేనందున రూ.58వేలు బుధవారం టంగుటూరి శీనయ్య చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా టంగుటూరి శీనయ్య మాట్లాడుతూ గతంలో వసుధ ఫౌండేషన్ తరుపున కొన్ని వేల మంది విద్యార్థులకు పుస్తకాలను గత 9 సంవత్సరాల నుండి అందజేయడం జరుగుతుందని తెలిపారు.అదే విధంగా కరోనా సమయంలో మరణించిన పేద కుటుంబాలకు రూ.1.20లక్షల ఆర్థిక సహకారం అందజేయడం జరిగిందన్నారు.అలాగే వసుధ ఫౌండేషన్ తరుపున వృద్ధాశ్రమాన్ని వెంకటరామరాజు ఏర్పాటుచేసి వృద్దులకు చేయూతను అందించారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు రాబోయే కాలంలో మరెన్నో చేయాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్,విశాంత్ర ఉపాధ్యాయుడు ఐ.వి.పక్కీరారెడ్డి,టీచర్ నాగరాజు,యాగంటిదేవసా ్థనం మాజీ చైర్మన్ బాలిరెడ్డి,ఎస్టీసెల్ నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు కృష్ణనాయక్,మాజీ సింగిల్‌విండో అధ్య క్షులు మల్లారెడ్డి,వార్డుమెంబర్ లాయర్ నాగేంద్రారెడ్డి,ఖాదర్,ఆర్‌సి నాగిరెడ్డి,ఆర ్యవైశ్య ప్రముఖులు భరతుడు,మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శివచంద్రయ్య,కాసుల జంగంశెట్టి,బింగిమళ్ల సుబ్రహ్మణ్యం,వంకదారి ప్రసాద్,టిప్‌టాప్ కలాం తదితరులు పాల్గొన్నారు.


**GOVERNMENT OF ANDHRA PRADESH**
**APEWIDC, NANDAYAL DIVISION**
**"e-procurement tender notice"**

Tenders are invited on eprocurement platform **Tender Notice NIT No. 33 to 63/EE/APEWIDC/NDL 2023-24, Dt. 01.07.2023 (2nd Call)** in various places in Nandayal District

NIT No. 33 to 63 downloading commencement on 07.07.2023 and closing date may be viewed in e-Procurement.gov.in

For further details can be viewed at https://tender.apeprocurement.gov.in
or contact Cell: 8008622291

Sd//., M.Bala Jojappa
EXECUTIVE ENGINEER
APEWIDC, NANDAYAL.

**CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ నేను వీరేంద్ర S/o ఈయల్లగౌడ్ వయస్సు 20 సంవత్సరాలు, చిరునామా గొల్లగేరి వీధి, నందవరం, ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా-518343 నా పేరును వీరేంద్ర నుండి ఈడిగె వీరేంద్ర గౌడ్‌గా మార్చాను, నా తండ్రి పేరు ఇ యల్లగౌడ్ పేరును కూడా ఈడిగ యల్లగౌడ్‌గా మార్చాను మరియు మా అమ్మ పేరును శారద నుండి ఈడిగ శారదగా మార్చాను. నా CBSE 10వ మార్కుషీట్ మరియు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ AP సర్టిఫికేట్‌లో పేరు తప్పుగా ఉన్నందున, మేము 30/06/2023 నాటి అఫిడవిట్ సర్టిఫికేట్ ద్వారా పేర్లను మార్చాము. భవిష్యత్తు, పాస్‌పోర్ట్, వీసా ప్రయోజనం కోసం.

(Ro.No. 14994)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తాం



**కర్నూలు న్యూసిటి, జూలై 5, ప్రభాతవార్త:** విద్యా వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యంచేస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తామని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం నూతనంగా ఎన్నుకోబడిన తెలుగుదేశం పార్టీ కర్నూలు జిల్లా పార్లమెంటు అధ్యక్షులు బిటి నాయుడును టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు రామాంజనేయులు, టిఎన్ఎంఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి బోయే తేజ, అధోని నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బెస్త జయ సూర్య, ప్రధాన కార్యదర్శి భలేకల్లు సూర్య, పట్టణ కార్యదర్శి సాయి, నూర్, రవి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వి ద్యావ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని వారు విమర్శించారు. నూతన విద్యావిధానం పేరుతో 3,4,5 తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయడం ఎంతవరకు సబబు అని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో రవి, ధర్మ, రామాంజి, మనోజ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డియం

**కోవెలకుంట్ల,జూలై 5,ప్రభాతవార్త :** కోవెలకుంట్ల ఆర్టీసి డిపో పరిదిలో నేడు డియల యువర్ డియం కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు డియంతిరుపతయ్య చెప్పారు. గురువారము ఉదయం 11గంటలనుండి 122గంటల వరకు డియల యువర్ డియం కార్యక్రమము ఏర్పాటుచేశామని చెప్పారు. ప్రయానికులు తమ సమస్యలను 9959225798 నెం.కు పోన్ చేసి సమస్యను తెలుపాలని కోరారు.

## ఆటో డ్రైవర్ నిజాయితీ....రూ.42 వేలు బ్యాగ్‌ను అందజేత



**నంద్యాల, జూలై 5, ప్రభాతవార్త :** తన కొడుకును కళాశాలలో చేర్పించేందుకు రూ.42 వేలతో ఓ మహిళ ఆటో ఎక్కి బ్యాగ్‌ను ఆటోనే మరిచిపోయి వెళ్లిపోయింది. నిజాయితీపరుడైన ఆటో డ్రైవర్ షెక్ ఉశేన్‌బాష డబ్బున్న బ్యాగ్‌ను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ ప్రభాకర్‌రెడ్డికి అందజేశారు. వివరాల మేరకు గడివేముల మండలం కరిమద్దెల గ్రామానికి చెందిన నారాయణమ్మ తమ కొడుకును రావూస్ కళాశాలలో చేర్పించేందుకు డబ్బున్న బ్యాగ్‌తో బస్టాండ్ నుంచి ఆటో ఎక్కి రావూస్ కళాశాల వద్ద డబ్బు బ్యాగ్‌ను మరిచిపోయి దిగిపోయింది. బ్యాగ్‌లో డబ్బున్న విషయాన్ని గమనించిన ఆటో డ్రైవర్ ఉశేన్‌బాష టూటౌన్ పోలీస్టేషన్‌కు వెళ్లి ఆ బ్యాగ్‌ను అందజేశారు. సదరు పోలీసులు ఆ బ్యాగ్ ఏవరిది అని వివరాలు అడిగి తెలుసుకొని నారాయణమ్మను పిలుపించుకొని పైసలు ఉన్న బ్యాగ్‌ను అందజేశారు. నిజాయితీగా ఆటో డ్రైవర్ బ్యాగ్‌ను అప్పగించడంతో పోలీసులు డ్రైవర్ ఉశేన్ బాషను ఘనంగా సత్కరించారు. నేటికి కొన్ని విలువలు ఉన్నాయంటే ఇటువంటి సంఘటనలు నిదర్శనమని పలువురు పేర్కొనడం విశేషం.

## అనస్తీసియా,మెడికల్ విభాగాల వైద్యులతో సమీక్ష



**కర్నూలు క్రైమ్,జూలై,5,ప్రభాతవార్త :** కర్నూలు ప్రభుత్వ సర్వజ వైద్యాల మెడిసిన్ మరియు అనస్తీసియా ప్రొఫెసర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు అడిషనల్ డీఎంఈ సూపరిటెండెంట్ డా.నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు.ఆయన మాట్లాడుతూ ఏఎంసి వైద్యులు అందుబాటులో లేకపోవడం పై అనేక ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. ఏఎంసి మరాయు క్యాజువాలిటీ విభాగాల్లో అసోసియేట్ ప్రొఫెసర్ మరియు పిజిఎస్ లేకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రొఫెసర్లు అసోసియేట్ ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు పిజిలు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అంధ్చిఆలని మెడికల్ మరియు అనసీసియా విభాగాధిపతులను ఆదేశించారు.ఆసుపత్రి నుంచి మెడికల్ మరియు అనస్తీసియా అసిస్టెంట్స్ మరియు పిజి లపై కంప్లేంట్స్ వస్తున్నాయి వారి పైన నిగా ఉండి పర్యవేక్షణ చేయాలని సంబంధిత విభావు హెచ్‌ఓడిఎస్ ని ఆదేశించారు.ఆసుపత్రి వైద్యులు తీరు మారకపోతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రత్యేకంగా ఏఎంసి విధుల నిర్వహించే మెడిసిన్ మరియు అనస్తీసియా అధ్యాపకులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటి సూపరింటెడెంట్ డి.ప్రభాకర్ రెడ్డి ఆసుపత్రి సిఎస్ఆర్ఎంఓ డా.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయానికి రూ.41.27లక్షల ఆదాయం



**బనగానపల్లెరూరల్,జూలై5,ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ హుండీ లెక్కి ంపును బుధవారం చేపట్టారు.ఈ లెకి ్కంపులో ఆలయానికి రూ.41,27,816లక్షల ఆదాయం వచ్చినట్లు,342గ్రాముల బంగారం,10.450 కేజిల వెండి వచ్చినట్లు ఆలయ ఈవో విఎల్ఎన్ రామానుజన్ తెలిపారు.ఈ లెక్కింపు కార్యక్రమం పర్యవేక్షణాధికారి పి.హరిచంద్రారెడ్డి మరియు కర్నూలు,నంద్యాల, కోవెలకుంట్లకు చెందిన శ్రీ సత్యనారాయణ సేవా సమితి వారు మరియు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్,వారి సిబ్బంది పాల్గొన్నారు.అదే విధంగా ఆలయానికి వచ్చిన ఆదాయం మూడు నెలల ఇరవై రోజులకు వచ్చినట్లు ఈవో తెలియజేశారు.

# స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024

### : ఓటర్ల జాబితాలో సవరణపై జిల్లా కలెక్టర్ డా.జి.సృజన సమీక్ష



**కర్నూలు, జూలై 05, ప్రభాతవార్త :** స్పెషల్ సమ్మరీ రివిజన్, 2024 ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్, 2024 లో భాగంగా జిల్లా లోని ఈఆర్‌ఓస్, ఏఈఆర్‌ఓస్ మరియు ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ లతో సమీక్ష మరియు ఎన్నికల చట్టాల పైన మరియు రివిజన్లో చేపట్టవలసిన కార్యక్రమాలపై శిక్షణ నిర్వహించిన జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.సృజన.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసినటువంటి ఎస్ఎస్ఆర్-2024 షెడ్యూల్ ప్రకారం ప్రతి కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించి ఓటర్ల జాబితాలో సవరణకు సంబంధించి ఫార్మ్ 6, 7, 8 లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న 5200 దరఖాస్తులను త్వరితగతిన విచారించి ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఓటుకు అర్హత ఉన్న ప్రతి వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. 18 సంవత్సరాల నుండి21 సంవత్సరంల వయసు కలిగిన వారికి వయసు ధ్రువీకరణ పత్రాన్ని కూడా పరిశీలించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో బిఎల్ఓ లకు ఈఆర్ఓ లు జులై 20 లోపల శిక్షణ ఇవ్వాలన్నారు. బిఎల్వోలు హౌస్ టు హౌస్ వెరిఫికేషన్ జూలై 21 నుండి ఆగస్టు 21 వరకు సమగ్రంగా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను సెప్టెంబర్ 29 లోపల పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. అక్టోబర్ 28,29 మరియు నవంబర్18,19 తేదీలలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంను జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మరియు ముఖ్యమైన కూడలిలో నిర్వహించాలన్నారు. 2024 జనవరి 5వ తేదీ నాటికి ఓటర్ల తుది జాబితాను ప్రచరణ చేయాలన్నారు. ఇఖీవీ లు క్షేత్రస్థాయిలో బిఎల్ఓ లకు ఫారం 6,7,8, లపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఒకే ఇంటిలో పది ఓట్లకు మించి ఉన్న ఇండ్లను క్షేత్రస్థాయిలో త్వరితగతిన పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు ఓటర్లను సుమోటోగా తొలగించకుండా పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఎలెక్టోరల్ రోల్, అవసరమైన పోలింగ్ స్టేషన్ల మార్పు తదితర అంశాలపై కూడా దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పైన పేర్కొన్న కార్యక్రమాలన్నిటిని ఎంతో క్షుణ్ణంగా మరియు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ, డిఆర్ఓ నాగేశ్వర రావు, కర్నూలు,పత్తికొండ ఆర్డీవోలు, జిల్లాలోని ఈఆర్ఓస్, ఏఈఆర్ఓస్ ఎన్నికల సూపరిండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగానికి జగనన్న పెద్దపీఠ - కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



**కోడుమూరు, జులై 5,ప్రభాతవార్త :** విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీఠ వేశారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం గూడూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలల్లో జరిగిన అమ్మవడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత నాల్గేళ్లుగా విద్యారంగానికి కోట్లాది రూపాయలను వ్యయం చేశారాని అమ్మవడి పథకంతో సామాన్య ప్రజలకు చెందిన విద్యార్థులకు ఒక వరంలా మారిందన్నారు. నాడు నేడు కింద కోట్లాది రూపాయలతో పాఠశాలల రూపు రేఖలు మార్చామని, నేడు ప్రభుత్వ బడులు కార్పోరేటు విద్యారంగానికి పోటీ పడేవిధంగా చేశామన్నారు. విద్యతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించా వారిలో నైపుణ్యతను తీసుకురావడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందించే వసతి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులపై పాఠశాల అద్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తీర్ణత శాతాన్ని తీసుకురావాలన్నారు.

**గూడూరులో జగనన్న సురక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే :** స్థానిక ఎంపిడివో కార్యాలయంలోని రెండవ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష పథకంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు 200 మంది దాకా సమస్యల గురించి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వీటిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది,గ్రామ వాలెంటీర్లు ఇంటింటికి తిరిగి అర్హులైన ప్రతి పేదవాడికి జగనన్న పథకాలు అందించాలని ఆదేశించారు. పరిష్కారం కాని పనుల గురించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. వచ్చే సోమవారం నుంచి ప్రతి సచివాలయంలో ఒక గంట కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో మాధవీలత, కమీషనర్ ప్రకాష్‌గౌడ్,ఎంఇవో నాగరాజు, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు,కెడిసిసి డైరెక్టర్ పత్తిరంగడు, గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు,వైఎస్ చైర్మన్లు అస్లాం, లక్ష్మన్న,కౌన్సిలర్లు మద్దిలేటి,జిల్లా సచివాలయం ప్రచారకార్యదర్శి ఎల్.వెంకటేశ్వర్లు, వైకాపా నాయకులు దండుశ్రీను,గంగాధర్,జులకల్ లక్ష్మీకాంతరెడ్డి,మధు,షేక్షా వలి, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి గెలిస్తే కర్నూలుకు పరిశ్రమలు - టిజీ భరత్



**కర్నూలు న్యూసిటి, జూలై 5, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ గెలిస్తే కర్నూలుకు పరిశ్రమలు తీసుకువస్తానని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ టిజీ భరత్ అన్నారు. నగరంలోని జోహరాపురంలో ఆయన ఇంటింటి పర్యటన చేపట్టి ప్రజలను కలిశారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు ప్రజలకు అందజేసి తెలుగుదేశం పార్టీ మొదటి విడత మేనిఫెస్టోను వివరించారు. ఈసందర్భంగా భరత్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. కర్నూలు ఇండస్ట్రీయల్ జోన్ ఉందని తాను గెలిచిన వెంటనే పరిశ్రమలు తీసుకువస్తానని హామీఇచ్చారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. పారిశ్రామిక వేత్తగా తనకున్న అనుభవంతో కర్నూలుకు పరిశ్రమలు తీసుకువచ్చి ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. తనను ఒక్కసారి గెలిపిస్తే కర్నూలు భవిష్యత్తు బాగుండేలా చూసుకుంటానన్నారు. వార్డు పర్యటనకు వచ్చిన టిజీకి స్థానికులు, రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ తాగునీటి సమస్యలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు మోహన్, వెంకటేష్, మాదవస్వామి, శ్రీనివాసులు గౌడ్, వెంకటేష్‌గౌడ్, తిమ్మోజీ, శ్రీనివాసులు, శాంతమ్మ గరిబా బి వెంకటరెడ్డి, విజయుడు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

## నాడు నేడు పనులపై ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు -ఫ్యాప్టో అధ్వర్యంలో నిరసన



**నంద్యాల విద్య, జూలై 5, ప్రభాతవార్త:** జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని నాడు నేడు పనుల కోసం ఉపా ధ్యాయులపై ఒత్తిడి తీసు కురావడం తగదని ఫ్యాప్టో సంఘం నాయకులు డిఇఓ సుధాకర్‌రెడ్డికి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఫ్యాప్టో చైర్మన్ మాధవస్వామి, జిల్లా జనరల్ సెక్రెటరీ సుబ్బన్న, నాయకులు శివయ్య, పివి ప్రసాద్, ఎస్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, జమాన్, కిశోర్, నగిరి శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, దస్తగిరి, రవిలు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల రీ అపాయిం ట్‌మెంటు ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉర్దూ, స్పెషల్ తెలుగు పాఠ్యపుస్తకాలు పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక తరగతులను నిర్బంధం చేయడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల విద్యాబోధనకు అటంకంగా ఉన్న పనులపై భారం తగ్గించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయునికి వారానికి 32 పిరియడ్లు మించకుండా టైంటేబుల్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డిఇఓ నాయకులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీతాల పరిష్కారానికి కృషిచేస్తానని ప్రత్యేక తరగతుల నిర్బందం కేవలం ఐచ్ఛికమేనని తెలిపారు. పుస్తకాలు, జెవికె కిట్లు తదితర కిట్లన్ని పాఠశాల అవరణకు చేరేలా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చినట్లు ఫ్యాప్టో సంఘాల నాయకులు తెలిపారు.

## సంకుల శ్రీను మృతికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సంతాపం



**బనగానవల్లె, జూలై 5,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని బుడగజంగాల కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్త సంకుల శ్రీను(51) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శ్రీను భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంకుల శ్రీను కాటసాని కుటుంబానికి వీరాభిమాని అని అలాంటి వ్యక్తి అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమని తెలిపారు.శ్రీను కుటుంబ సభ్యులకు తన అండదండలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు.ఎమ్మెల్యే వెంట సంకుల చిన్నస్వామి,తాటికొండ పెద్దబ్బి,శివకుమార్,బాలు, సుబ్బరాయుడు,అర్జున్,బుర్రకథల బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

## ప్రతి గడపకు సంక్షేమం - ఎమ్మెల్యే



**చాగలమర్రి,జూలై5,ప్రభాతవార్త:** ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజే ం ద్రారెడ్డి తెలిపారు.బుధవారం చాగలమర్రి పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు రాష్ట్ర మైనార్టీసెల్ కార్యదర్శి షేక్ బాబులాల్,మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, నాయకులు,కార్యకర్తలు గజమాలతో ఘనస్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా లేదా అడిడి తెలుసుకున్నారు.ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నందున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని ఆయన ప్రజలను కోరారు. అధికారులు సక్రమంగా సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు చేపట్టాలని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి అధికారి తప్పనిసరిగా పాల్గొనాలని లేదంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహమ్మద్ సోహేల్,మండల ఉపాధ్యక్షులు ముల్లా రఫి,మండల కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి,ఎంపిటిసిలు ఫయాజ్, లక్ష్మిరెడ్డి, నాయకులు గణేష్‌రెడ్డి,వెంకటరమణ,బురానుద్దీన్,అబ్దుల్లా,ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫి,ఖాదర్ బాషా,నారా ఓబులేసు,ఎంపిడివో మహబూబ్ దౌలా,తహసీల్దార్ సుభద్రమ్మ,ఎంఈవో అనురాధ,ఈఓఆర్డీ సుదర్శన్‌రావు,ఏఈలు షాజహాన్,రంగనేతాజీ తదితరులు పాల్గొన్నారు.

**వైద్య సిబ్బంది పై ఆగ్రహం :** గడప గడపకు మన ప్రభుత్వం కార్య క్రమం లో వైద్యాధికారుల పై ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక ఎస్టీ కాలనీకి చెందిన వారు తమ ఆరోగ్య సమస్యల పై ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.దీంతో ఎమ్మెల్యే వైద్యాధికారులను అక్కడికి పిలిపించి ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు రాలేదని తెలపడంతో వైద్యాధికారులు స్థానికంగా ఉండాలని వైద్యపరీక్షలు సక్రమంగా నిర్వహించి ప్రజలకు సక్రమంగా వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆయన తెలిపారు.

# ఇళ్ళ నిర్మాణాలలో రోజు వారీ లక్ష్యాలు

### టెలి కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవోలు, ఇంజనీర్‌లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా.జి.సృజన



**కర్నూలు, జూలై 05, ప్రభాతవార్త :** ఇళ్ళ నిర్మాణాల రోజు వారీ లక్ష్యాలను కచ్చితంగా సాధించాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన ఎంపీడీవో లు, హౌసింగ్ ఇంజనీర్ లను ఆదేశించారు.బుధవారం ఉదయం స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఇంజనీర్లతో హౌసింగ్, ఉపాధి హామీ పథకం అమలు,ప్రాధాన్యత భవనాల పురోగతిపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మంగళవారం నాడు స్టేజ్ కన్వర్షన్ పై స్టేజ్ కన్వర్షన్ పురోగతి పై సమీక్షిస్తూ, స్టేజ్ కన్వర్షన్ లో ఏ ఒక్క రోజు కూడా జీరో నమోదు అవ్వకూడదని చెప్పినప్పటికీ కూడా కొన్ని మండలాలు జీరో నమోదు చేస్తున్నారన్నారు..బిలో బేస్మెంట్ లెవెల్ నుండి బేస్మెంట్ లెవెల్ స్థాయి వరకు జీరో పురోగతి సాధించిన గోనెగండ్ల, హాలహర్వి, కర్నూల్, ఆదోని, చిప్పగిరి, కోడుమూరు ఎంపీడీఓలతో మాట్లాడుతూ ఇచ్చిన లక్ష్యాలు తక్కువ ఉన్నప్పటికీ కూడా జీరో పురోగతి సాధించడం ఏంటని, ఇంకొక్కసారి జీరో నమోదు చేస్తే సంబంధిత అధికారుల మీద చర్యలు తప్పవన్నారు. బేస్మెంట్ లెవెల్ నుండి కంప్లీషన్ స్థాయి స్టేజ్ కన్వర్షన్ లో జీరో పురోగతి చూపించిన గోనెగండ్ల, నందవరం, ఆదోని రూరల్, సి. బెళగల్ హౌసింగ్ ఇంజనీర్లతో కలెక్టర్ మాట్లాడుతూ స్టేజ్ కన్వర్షన్ లో జీరో పురోగతి ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పూర్తి స్థాయి దశ పనులలో హోళగుంద, వెల్దుర్తి మండలాల్లో పురోగతి చాలా తక్కువగా ఉందని పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖకు సంబంధించి బడి బయట ఉన్న పిల్లలను వాలంటీర్ యాప్ లో అప్డేట్ చేయించడం పూర్తిగా మండల విద్యాశాఖ అధికారులదే బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి లేబర్ మొబిలైజేషన్లోతక్కువ మొబిలైజేషన్ చేసిన కృష్ణగిరి, నందవరం మండలాలు 100 శాతం పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ కి సంబంధించి బ్లూ ఫ్రాగ్ యాప్ నందు పిట్టింగ్ అప్డేషన్ చేయడంలో తుగ్గలి, కల్లూరు, వెల్దుర్తి మండలాలు వెనుకబడి ఉన్నాయని, రెండు రోజుల్లో పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలకు సంబంధించి మండలాల వారిగా లక్ష్యాలు ఇవ్వడం జరిగిందని వాటి పురోగతి మీద ప్రతివారం ఎఈలతో ఎంపీడీవోలు సమీక్షించాలన్నారు.టెలి కాన్ఫరెన్స్లో హౌసింగ్ పీడీ వెంకట నారాయణ, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ ఈ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# గడప గడపకు మన ప్రభుత్వం

### - శ్రీ వాల్మీకి మహర్షి సన్నిధిలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**కోడుమూరు,జులై 5,ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులో సోమవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని కోట వీధిలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి గత నాల్గేళ్ల వైకాపా పాలనలో సాధించిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. ప్రతి ఏటా సంక్షేమ క్యాలెండర్‌లో క్రమం తప్పకుండా ఇచ్చిన మాట తప్పకుండా అర్హులైన ప్రతి పేదవాడికి బటన్ నొక్కి సహాయం అందిస్తున్నామని ప్రజలకు తెలియజేశారు. వైకాపా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించామని, తమ ప్రభుత్వంలో అమలుపరుస్తున్న పథకాలన్నీ రాజకీయాలకు అతీతంగా అందిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి జగనన్న పథకాలు అందించామని, వైకాపా ప్రభుత్వ పథకాలు అందని వారు లేరని నిరూపిస్తే దేనికైన సిద్ధమన్నారు.

**వాల్మీకి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు :** గురు పౌర్ణమి వేడుకల సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కోడుమూరు పట్టణంలోని శ్రీ వాల్మీకి మహర్షి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు గావించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో చంద్రశేఖర్,వ్యవసాయ అధికారి రవిప్రకాష్,తాహశీల్దార్ జయ్యన్న, వైకాపా నాయకులు అద్దుగుల రాజశేఖర్‌రెడ్డి,లాయర్ ప్రభాకర్,డాక్టర్ షాకీర్,అద్దుగుల ప్రతాపరెడ్డి,ఏకాంబరం,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బిందుసేద్యం రైతులకు లాభదాయకం

### - రాయితీపై రైతులకు డ్రిప్ సౌకర్యం - రైతులకు డ్రిప్ పరికరాలు పంపిణీ - ఎంఎల్ఏ వై.బాలనాగిరెడ్డి



**మంత్రాలయం,జూలై 5,ప్రభాతవార్త:** బిందుసేద్యం రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఎంఎల్ఏ వై.బాలనాగిరెడ్డి అన్నారు.బుధవారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన డ్రిప్ పరికరాలను ఎంఎల్ఏ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంఎల్ఏమాట్లాడుతూ మంత్రాలయం,కోసిగి,కౌతాళం మండలాలకు చెందిన 35 మంది రైతులకు సంబంధించిన 23.76 హెక్టార్ల భూమికి రూ.34.12 లక్షలు విలువగల డ్రిప్ పరికరాలను ఏపిఎంఐపి పిడి ఉమాదేవి చేతుల మీదుగా అందించామన్నారు.మిగిలిన మండలాలకు వెళ్ళే వాహనాలను జెండాఊపి ప్రారంభించామన్నారు.అధికారులు ఏర్పాటు చేసిన స్టాళ్ళను పరిశీలించారు. తక్కువ నీటితో ఎక్కువ భూమిని సాగుచేసుకోవచ్చన్నారు.జగనన్న ప్రభుత్వం బిందుసేద్యానికి అధిక ప్రధాన్యత ఇస్తుందని తెలిపారు.కాబట్టి రైతులు బిందుసేద్యం చేసి అధిక దిగుబడులు సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ భీంరెడ్డి,ఇంఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి,ఏడిఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ జీరా గణేష్,ఏపిడి కృష్ణారెడ్డి,ఎంఐడిసి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

## జగనన్న చెప్పాడంటే చేసి చూపిస్తాడు అంతే : ఎంఎల్ఏ శిల్పారవి



**నంద్యాల,జూలై 5,ప్రభాతవార్తప్రతినిధి :** మన ముఖ్యమంత్రి ఏదైన చెయాలను కుంటే దానికి కార్యచరణలో పట్టి చేసి చూపిస్తాడని యంయల్ఏ శిల్పారవి చంద్రకిశోరురెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్త ంగా ఈ నెల 1వ తేది నుండి జనగన్న సురక్ష కార్యక్రమము నిర్వహిస్తున్నట్లు అందులో ప్రతి వార్డు నియోజక వర్గం సచివాలయ పరిదిలో కార్యక్రమం చేపట్టుతున్నారు.అందులో బాగంగా నంద్యాల పట్టణంలోని 5,6 వార్డులో బుదవారము సురక్ష ఏర్పాటు చేశారు అందులో యంయల్ఏ శిల్పారవిచంద్రకిశోరురెడ్డి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో 1540మంది కుల,అదాయ, భూమి రిపోర్ట్స్ తదితర ధ్రువ పత్రాలను అందించారు.ఈ సందర్భముగా ఏర్పాట్లు చేసిన సమావేశములో శిల్పా మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నిత్యము ప్రజల సంక్షేమము కొరకు తపిస్తాడని చెప్పారు.అందుకే ఏదైన చేయాలనుకుంటు దానికి చేసి చూపిస్తాడని చెప్పారు. సంక్షేమం అబివృద్ధి రెండు కళ్లలాగా అయన పని చేస్తున్నాడని చెప్పారు. అందుకే నంద్యాల తెలుగు దేశం నుండి ప్రజలు వైసిపి వలస పట్టారని చెప్పారు. జగనన్న చేపట్టినసురక్ష మీకు రక్షణగా ఉంటుందని చెప్పారు. ఈకార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ఎమ్మెల్సీ ఇసాకుభాష, అదిక సంఖ్యలో మహిలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



**చాగలమర్రి, జూలై 5,ప్రభాతవార్త:** మండలంలోని చిన్నవంగలి గ్రామంలో విద్యు త్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది.గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి , సుభద్ర దంపతులకు ఇద్దరు సం తానం.వారి కుమారుడు సుదర్శన్‌రెడ్డి(27) ప్రొద్దుటూరులో దుకాణం నిర్వహి స్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు.ఇంటికి విద్యుత్ సరఫరా కాకపోవడంతో విద్యుత్ తీగను సవరిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు.ఒకానొక కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కలిచివేసింది.విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ షాజహాన్,ఎస్ఐ రమణయ్యలు సంఘటన స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు.యువకుడు విద్యుత్ షాక్‌కు ఎలా గురయ్యాడని పలువురిని విచారించి ఈ విషయం పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

**మాజీ మంత్రి పరామర్శ :** చిన్నవంగలి గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన శివశంకర్‌రెడ్డి మృతి చెందాడన్న విషయం తెలుసుక్ను తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి,మాజీ మంత్రి అఖిలప్రియ గ్రామానికి చేరుకుని భౌతికకాయం పై పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్యపడవద్దని వారికి అండగా ఉంటామని ఆమె తెలిపారు.సంతాపం తెలిపిన వారిలో టీడీపీ నాయకులు సంజీవరెడ్డి,శేఖర్‌రెడ్డి,నరసింహారెడ్డిలు ఉన్నారు.

## శ్రీశైలం ఇంజనీరింగు పనులపై ఏసిబి ఆరా

**శ్రీశైలంప్రాజెక్టు,జూలై05,ప్రభాతవార్త :** శ్రీశైలక్షేత్రంలో గతంలో జరిగిన ఇంజనీరింగు పనులపై గత రెండు రోజుల నుండి కర్నూలు జిల్లా ఏసిబి ఇన్స్‌పెక్టర్ వంశీ మరియు సిబ్బందితో కలసి శ్రీశైలం ఇంజనీరింగు అధికారులు చేసిన పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈక్రమంలోనే క్షేత్రంలో గతంలో ఇంజనీరింగు పనుల అవకతవకలపై వచ్చిన పిర్యాదుల నేపధ్యాంలో ఏసిబి అధికారులు పనుల నిర్వహణపై పరిశీలించడం జరుగుతుంది.ఈ నేపధ్యాంలోనే ఆలయ మాడవీదులు,ఔటర్‌రింగు రోడ్డు,పుష్కరిణి పనులను తదితర పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఈఈలు రామకృష్ణ,నరసింహారెడ్డి, ఏఈ భావన్ తదితరులు పాల్గొన్నారు.

